J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 24 18.11.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# విశాఖ 'వైజేపి' సభ సక్సెస్



## పథకాలు కేంద్ర ప్రభుత్వానివి - ప్రకటనలు రాష్ట్ర ప్రభుత్వానివి

## కార్యక్రమం ప్రధానమంత్రిది - హడావుడి వైసిపి నాయకులది

## సందడి వైకాపా, భాజపాలది - సందట్లో సడేమియా జనసేనది

## వైసిపి ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ భారీ సభ అదిరిపోయింది

## ఉత్సాహంతో వైసిపి - సందిగ్ధంలో టిడిపి - అయోమయంలో బిజెపి, జనసేన


*నవంబర్ 11, 12వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగిన ప్రధానమంత్రి పర్యటన, భారీ బహిరంగ సభ, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు భవిష్యత్‌లో రాజకీయాలలోకి రావాలనుకునేవారికి చక్కని సందేశాన్నిచ్చాయి. రాష్ట్ర భవిష్యత్తు, వ్యక్తిగత ప్రయోజనాలు, కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలను ప్రసన్నం చేసుకునే క్రమంలో పార్టీలు... పాలసీలు, సిద్ధాంతాలతో సంబంధం లేకుండా కలసిపోవచ్చుని రుజువు చేశాయి బీజేపీ, వైసీపీలు.*

*ప్రధాని రాష్ట్ర పర్యటనతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగితే, టీడీపీ సందిగ్ధంలో పడిపోయింది. ఏం జరుగుతుందో అర్ధం కాని బీజేపీ, జనసేన పార్టీలు అయోమయంలో ఉండిపోయాయి.*

ప్రధాని నరేంద్రమోడీ పర్యటన ఆంధ్రా రాజకీయాలలో పెను సంచలనంగా మారిందనడానికి సందేహమే అక్కరలేదంటున్నారు విశ్లేషకులు. 10,742 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన, చేపట్టనున్న వివిధ పథకాలకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు ప్రధాని మోడీ. ఈ కార్యక్రమానికి విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం వేదికయ్యింది. అయితే, కేంద్రంలో అధికారంలో ఉంది బీజేపీ. రాష్ట్రంలో పరిపాలిస్తుంది వైసీపీ. బీజేపీని హిందుత్వ పార్టీ, మతతత్వ పార్టీ అని వైసీపీ నాయకులు విమర్శిస్తే, వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా బీజేపీ శ్రేణులు దుమ్మెత్తిపోస్తుంటారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రానికి వచ్చిన భాజపా ప్రధానమంత్రి సభను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం రాష్ట్ర రాజకీయాలలోనే కాదు, దేశ రాజకీయాలలో కూడా కొత్త సంప్రదాయంగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సహజంగా కేంద్ర పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రాంతీయ పార్టీలే ఈ తరహా ఆచారాన్ని పాటిస్తాయి. కానీ, ఇక్కడ బీజేపీ, వైసీపీకి అస్సలు పడదు. ఈ పరిస్థితులలో ప్రధాని పర్యటన విజయవంతం చేయడం కోసం వై.వి. సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి విశాఖలోనే మకాం వేయడం, చేసిన ఏర్పాట్లపై జగనే స్వయంగా అరాతీయడం, మూడు లక్షల మందికిపైగా జనాన్ని విశాఖ సభలో కూర్చోబెట్టి మోడీని ఖుషీ చేయడం వెనుక అంతరార్ధం రాష్ట్ర రాజకీయవర్గాలకు అంతుబట్టడంలేదు.

10లో





## వెండి తెరకు తీరని శోకం

# ముగిసిన తొలి శకం

నటనారంగంలో మేరునగధీరులైన ఒక్కొక్కరూ తిరిగిరాని తీరాలకు తరలిపోతున్నారు. తెలుగు ప్రజలు ఆరాధించిన పాతతరం మహానటులు ఒకరి తర్వాత ఒకరు మనల్ని వీడి వెళ్లిపోతున్నారు. 'ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు,'.. అందరూ ఉద్దండులే. మహానటులే. ఆ వరుసలో సూపర్‌స్టార్ కృష్ణ కూడా చేరారు. ఆయన అస్తమయంతో తొలి తరం అగ్రశ్రేణి హీరోల శకం ముగిసిపోయినట్లేనని ప్రజలంతా ఆవేదన చెందుతున్నారు.

నవంబరు-15.. తెలుగు సినీపరిశ్రమలో మరో విషాద దినం. సూపర్‌స్టార్ కృష్ణ.. 15 వేకువన అనారోగ్యంతో అస్తమించారు. ఆకాశంలో ఎన్నో తారలున్నా.. అక్కడ కూడా తన ప్రత్యేకత చూపుతూ.. కృష్ణ ఒక ధృవతారగా.. 'సూపర్‌స్టార్'గా నిలిచిపోయారు. ఆయన మృతితో.. ఒక నటశిఖరం ఒరిగిపోయినట్లయింది. తొలి తరం శకం ముగిసినట్లయింది. ప్రేక్షక లోకం కన్నీటిసంద్రమైంది. వెండితెరకు, అభిమానులకు తీరని శోకమే మిగిలింది.

## అనంత లోకాలకు 'అఖండుడు'

3లో..

# రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉంటా!

## మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం



రైతన్నల కుటుంబాలకు తాను ఎల్ల వేళలా అండగా ఉంటానని, వారి సంక్షే మానికి బాసటగా నిలుస్తానని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారా యణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన కలువాయి మండలం చింతలాత్మకూరులో సోమశిల సౌత్ ఫీడర్ ఛానల్ నుండి ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథ కానికి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లా కలువాయి మండలం చింతలాత్మకూరులో 15.80 లక్షల రూపాయల వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులు ఇక ప్రారం భమవుతాయన్నారు. చింతలాత్మకూరుతో తనకు దాదాపు ముప్పైఏళ్ల అనుబంధం ఉందని, ఈ ప్రాంత ప్రజలు, నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. సోమశిల దక్షిణ కాలువ నుంచి కలువాయి మండలంలో పలుగ్రామాలకు సాగునీరు దించాలనేది ఎంతోకాలంగా తన ఆలోచన అని, అది ఇన్నాళ్ళకి సాకారమైందని సం తోషం వ్యక్తం చేశారు. దీనికి లిఫ్ట్ ఇరి గేషన్ ద్వారానే నీరు అందించగలమని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారని, అయితే ప్రాజెక్టుల కింద ఎక్కడా అధికారి కంగా లిఫ్ట్ సిస్టం పెట్టే అవకాశం లేకపోవ డంతో, అనధికారికంగా రైతులు మోటా ర్లతో నీళ్ల తోడుకొనే పరిస్థితి ఉండేద న్నారు. ప్రత్యామ్నాయంగా చెరువులకు నీళ్ల నింపాలనే ఆలోచన చేశామని, అయితే సోమశిల నుంచి నీటిని చెరువు లకు తరలించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రభుత్వం అనుమతించిందని, మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, అంబటి రాంబాబు సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ ప్రాం తంలో వందలాది ఎకరాల నిమ్మ తోట లకు లిఫ్ట్ ఇరిగేషన్ చాలా ఉపయోగకరమ న్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. నిర్మాణ వ్యయం తక్కు వైనా అనుమతి చాలా కష్టతరమైందని, అయినా రైతులకు మంచి చేసే ప్రయత్నం చేస్తుంటే కొందరు అడ్డుకోవాలని చూడటం దుర్మార్గమన్నారు. కొంతమంది అధికారు లను కూడా బెదిరిస్తున్నారని అంటూ, అధి కారులు ఎవరూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ఆనం భరోసా ఇచ్చారు.

# దోచుకున్న సొత్తుని.. ఏం చేశారు?



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ జేడీ రెడ్డి గంగాధర్

***నెల్లూరు సివిల్ సప్లయిస్ కుంభకోణంలో విచారణ జోరు పెరిగింది. అక్రమార్కుల ఆట కట్టించడానికి ఉన్నతాధికారుల బృందాలు రంగంలోకి దిగాయి. రైతుల కోసం, హమాలీల కూలీల కోసం వెచ్చించాల్సిన కోట్లాది రూపాయలను దిగమింగిన ఆ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, మరికొందరు ప్రైవేటు వ్యక్తుల భాగోతం ఒక్కొక్కటిగా విచారణలో బయటపడుతున్నాయి. నిందితులు ఆ సొత్తునంతా ఏం చేశారన్న విషయంపై ఏసీబీ జేడీ రెడ్డి గంగాధర్ ఆధ్వర్యంలో ఏసీబీ డీఎస్పీ మోహన్ తన సిబ్బందితో పూర్తి స్థాయిలో విచారణ ప్రారంభించడంతో, ఈ కుంభ కోణంలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.***

- సివిల్ సప్లయిస్ కుంభకోణంలో ఏసీబీ జేడీ విచారణ
- 22.45 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు
- ఇంకా ఎన్ని అక్రమాలు బయటపడతాయో!..

తీగ లాగేకొద్దీ అక్రమాల డొంకంతా కదులుతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దిగమింగిన భారీ కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరన్నది అంతు తేలుస్తున్నారు అధికారులు. అక్రమార్కుల లావాదేవీలను, వారికి సహకరించిన వారందరి లోగుట్టును వెలికి తీస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన సూత్రధారి శివకుమార్‌తో పాటు మొత్తం ఆరుగురు నిందితులను ఏసీబీ అధికారులు పోలీస్‌కస్టడీకి తీసుకున్నారు. మరో వారం రోజుల పాటు వారిలో పలువురిని విచారించేందుకు అనుమతించాలని అధికారులు కోర్టును కోరినట్లు తెలుస్తోంది.

### కోట్లల్లో డబ్బు..చేతులు మారింది

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న శివకుమార్ ఈ భారీ కుంభకోణంలో ప్రధాన పాత్ర వహించాడని, ఆయన బంధువులు, స్నేహితులకు దాదాపు 22.45కోట్ల రూపాయల దాకా ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. ఒక్కొక్కరికి లక్షల్లోనే ఇచ్చేసినట్లు చెప్తున్నారు. వీరంతా కలసి పెద్దఎత్తున భవనాలు, ఇష్టానుసారం భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇలా ఎన్ని కోట్ల రూపాయలు చేతులు మారాయో అంతుపట్టని విధంగా ఉంది. ఈ నగదు బదిలీలన్నీ ఎలా జరిగాయి?..ఎవరి ప్రమేయంతో జరిగాయన్నది కూడా అధికారులు కూపీ లాగుతున్నారు.

### విస్తుపోయే విలాసాలు

ప్రధాన నిందితుడు శివకుమార్ తన వద్ద పనిచేసే డ్రైవర్‌కు కూడా పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చాడని, దీంతో ఆయన విలాస వంతమైన భవనం, సినిమా స్టయిల్‌లో ఫింగర్‌ప్రింట్స్‌తో మాత్రమే తెరచుకునే తలుపులు, ఎక్కడ చూసినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటివన్నీ చూసి అధికారులే విస్తుపోతున్నారు. దీన్నిబట్టి నిందితులు ప్రజాధనాన్ని ఎంత విచ్చలవిడిగా వాడుకున్నారో ఇట్టే తేటతెల్లమవుతుందని అంటున్నారు. కోట్ల డబ్బుతో అనేక రకాల భవనాలు, వ్యాపారాలకు నిందితులు తెరతీశారు. ఇష్టా రాజ్యంగా డబ్బును వెచ్చించారని తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటిదాకా 30కోట్ల దాకా స్వాహా జరిగిందనుకుంటే, ఇప్పుడు విచారణలో ఆ మొత్తం దాదాపు 55 కోట్లకు పైగానే ఉంటుందని కూడా అధికారులు భావిస్తున్నారు. ఆడిటర్లతో ఆ లెక్కలన్నీ వెలికితీస్తున్నారు. రికార్డులను పదేపదే తనిఖీ చేస్తున్నారు. ప్రతి రూపాయికి సంబంధించిన లావాదేవీలను కూలంకుషంగా పరిశీ లిస్తున్నారు. గతంలో ఉన్న సంబంధిత బ్యాంకు అధికారులను కూడా ఈ విషయమై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

### పూర్తిస్థాయిలో విచారణ

ఈ కుంభకోణానికి సంబంధించి బాధ్యులుగా భావిస్తున్న 32 మంది పనితీరును, వారి వ్యవహారాలను అన్ని కోణాల్లో విచారించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వారి ఆర్థిక వ్యవహారాలు, ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. గతంలో సివిల్ సప్లైస్ సంస్థ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరగడం, రికార్డులు తగలబడిన సంఘటనకు సంబంధించి అసలు వాస్తవాలు ఏమిటోనని కూడా నిర్ధారించేందుకు అధికారులు లోలోపలే ఆరాతీస్తున్నట్లు సమాచారం! అన్నిటినీ పూర్తిస్థాయిలో పరిశీలించి, సివిల్ సప్లయిస్‌లో ఇంకా ఎన్ని అక్రమాలు జరి గాయో.. ఎంతకాలం నుంచి ఈ స్వాహాయణం జరుగుతుంద నేది కూడా అధికారులు త్వరలోనే నిగ్గుతేల్చనున్నారని తెలుస్తోంది.

ఏసీబీ జేడీ నెల్లూరులోనే మకాం వేసి ఈ కుంభకోణం అంతు తేల్చాలని విచారణ ముమ్మరం చేయడంతో నిందితులే కాక, ఇంకా వెలుగులోకి రాని అనేకమంది అక్రమార్కుల బండారం కూడా బయటపడవచ్చని అనుకుంటున్నారు.




# చిన్నారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

## 'ఉజ్వల ఖ్యాతి' అవార్డుల సభలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

చిన్నారుల్లో సహజంగానే ఎంతో ప్రతిభాపాటవాలు దాగుంటాయని, వారిలోని సృజనాత్మకశక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో బాగా రాణిస్తారని, తల్లితండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారికి బంగారుభవితను అందించాలని టిటిడి ఉత్తర భారతదేశ ఆలయాల సలహా కమిటీ (న్యూఢిల్లీ) ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్‌మహోత్సవాల సందర్భంగా ఈనెల 13న నెల్లూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని ఉజ్వల ఖ్యాతి చిత్రకళాప్రతిభను అభినందిస్తూ, ప్రతిష్ఠాత్మక మైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు అవార్డులు బహూకరించారు. ఈ సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన అభినందన వేడుకలో ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఉజ్వల ఖ్యాతి జాతీయ, అంతర్జాతీయస్థాయి అవార్డులను సాధించడం సంతోషకరమంటూ ఆ విద్యార్థినిని అభినందించారు. మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులను, జాతీయ నాయకులను 75 మందిని ఎంపిక చేసుకుని వారి చిత్రాలను నెమలీకలపై అత్యద్భుతంగా చిత్రించి ఉజ్వల ఖ్యాతి చిత్ర కళారంగానికే ఖ్యాతి తెచ్చిందని ఆయన కొనియాడారు. ఉజ్వల తల్లితండ్రులు నెల్లూరు విద్యుత్‌శాఖలో డిఇఇగా పనిచేస్తున్న ఎన్.సునీల్‌కుమార్, పోస్టల్‌శాఖలో పనిచేస్తున్న చెంచులక్ష్మి అటు చదువులోనూ, ఇటు చిత్రకళారంగంలోనూ ఉజ్వలను ప్రోత్సహించడం, అందుకు తగ్గట్టుగా ఉజ్వల ఖ్యాతి తనకిష్టమైన చిత్రకళలో ఎంతో కష్టసాధ్యమైన రీతిలో నెమలీకలపై, రావి ఆకులపై దేశనాయకుల చిత్రాలను చిత్రిస్తూ అద్భుతాలు సృష్టించడం నెల్లూరుసీమకే గర్వకారణమని ఆయన కొనియాడారు. స్థానిక 'కళాదీప్తి-రోటరీ క్లబ్ నెల్లూరు-శక్తి' సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి వివేక్ ఆర్.నాయర్ పాల్గొని ఉజ్వల ఖ్యాతికి అవార్డులను బహూకరించి అభినందించారు. ఉజ్వల ఖ్యాతి తమ స్కూల్ విద్యార్థిని కావడం తమకెంతో సంతోషంగా ఉందని, ఆ విద్యార్థిని మరెన్నో ప్రపంచస్థాయి అవార్డులను అందుకోవాలని ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ కుమ్మమూరు రవి ఆకాంక్షించారు. గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ డైరెక్టర్ ఎస్.విజయరామిరెడ్డి, స్కాలర్స్ స్కాలర్స్ స్కూల్ కరెస్పాండెంట్ పి.పద్మజారెడ్డి, నేషనల్ హైవేస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.అనిల్ కుమార్‌రెడ్డి, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ విశ్రాంత కోఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, ప్రముఖ కవి, 'లాయర్' వారపత్రిక సబ్ ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, ఉజ్వలఖ్యాతి తల్లితండ్రులు పాల్గొన్నారు. రోటరీక్లబ్ నెల్లూరు-శక్తి ప్రెసిడెంట్ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించగా, కళాదీప్తి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేత ఇ.కె సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాదీప్తి చిన్నారుల నృత్యాలు, శ్రీ వేంకటేశ్వర మహిళా కోలాట భజనమండలి వారి కోలాటాలు అందరినీ అలరించాయి.

# ఘంటసాల పాటలతో పులకించిన పురమందిరం

## అభినవ ఘంటసాల డిప మిత్రకు..'కిన్నెర' పురస్కారం



పద్మశ్రీ ఘంట సాల పాటలతో నెల్లూరు పురమం దిరం పులకించింది. పలువురు ప్రముఖ గాయనీగాయకులు ఘంటసాల పాటలను వీనులవిందుగా గానం చేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. మధురగాయకుడు, దివంగత ఘంటసాల శతజయంతి మహోత్స వాలను పురస్కరించుకుని స్థానిక టౌన్‌హాల్‌లో ఇటీవల ఈ కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా వేలాది సంగీత కచ్చేరీల్లో ఘంటసాల పాటలను అత్యద్భుతంగా గానం చేసి ఎన్నో అవార్డులందుకున్న ప్రముఖ గాయకుడు డిపి మిత్రకు కిన్నెర ఆర్ట్ థియేటర్స్ –హైదరాబాద్ వారు నెల్లూరులో 'కిన్నెర' పురస్కారాన్ని బహూకరించారు. కృష్ణాజిల్లా విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం తదితర ప్రముఖులు పాల్గొని మిత్రకు ఆ పురస్కారాన్ని అందజేశారు. ఘంటసాల పాటలను ఘంటసాలే పాడుతున్నారా అన్నట్లుగా పాడడంలో డిపి మిత్ర ఎంతో ఖ్యాతిని పొందారని, అంతటి ప్రతిభను సాధించేందుకు ఏళ్ళతరబడి మిత్రా చేసిన సాధన అపూర్వమని ఈ సందర్భంగా వ్యాఖ్యాత ఎస్‌వి రామారావు కొనియాడారు. 'కిన్నెర' కార్యదర్శి మద్దాళి రఘురాం, తిరుపతి విమానాశ్రయం డైరెక్టర్ ఎం.రాజకిషోర్, స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో డిఇఇ పి.జగన్మోహన్‌రావు, మెజీషియన్ రాంజీ, నిర్మల ఏజెన్సీస్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతన కళాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఘంటసాల సంగీత విభావరిలో డిపి మిత్ర 'శిలలపై శిల్పాలు చెక్కినారు', 'నేను పుట్టాను ఈ లోకం నవ్వింది' వంటి ఘంటసాల పాటలను అత్యద్భుతంగా గానం చేసి అందరి కరతాళధ్వనుల లందుకున్నారు. ప్రముఖ గాయనీ గాయకులు శ్రీవల్లి, కె.రాజేంద్రప్రసాద్, సురేఖామూర్తి, వై.శేషగిరీశం, జి.ఆదిశేషు, రామచంద్రరావు, ఎం.బుజ్జయ్య, కెపి నరసింహారావు తదితరులు పాల్గొని ఘంటసాల మధురగీతాలను గానం చేశారు.



# అనంత లోకాలకు అఖండుడు

**దశాబ్దాల తరబడి తన విశేష నటనా చాతుర్యంతో అశేష ప్రేక్షక జనావళిని ఉర్రూతలూగించిన మహానటుడు.. నటశేఖరుడు..కృష్ణ 79 ఏళ్ళ వయసులో అనారోగ్యానికి గురై కన్నుమూయడంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ మూగబోయింది. నటశేఖరునిగా, డేర్ అండ్ డ్యాషింగ్ హీరోగా.. సూపర్‌స్టార్‌గా ప్రఖ్యాతి గన్న కృష్ణ.. ఇక లేరన్న సమాచారం.. తెలుగు ప్రజలకు కంటనీరు తెప్పించింది. ఆయన అంత్యక్రియలు ఈనెల 16న హైదరాబాద్‌లో జరిగాయి. కృష్ణ తనయుడు.. సూపర్‌స్టార్ మహేష్‌బాబు, తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత, ఆయన పార్థివదేహాన్ని దర్శించుకున్న అభిమానులు, ప్రముఖులు ఆ సాహస నటునికి కడసారి కన్నీటి వీడ్కోలు తెలిపారు.**

## సాహసాలకు పెట్టింది పేరు

సాహసాలకు పెట్టింది పేరు.. అనుకున్నది సాధించేదాకా వదలని తీరు.. ఆయనే నటశేఖరుడు, తెలుగువారి జేమ్స్‌బాండ్.. సూపర్‌స్టార్ కృష్ణ. దాదాపు 340 సినిమాల్లో హీరోగా నటించి, చిత్రపరిశ్రమలో ఎవరూ చేయలేనన్ని సాహసాలు చేసి, తెలుగు సినిమారంగానికి అనేకరకాల సాంకేతికలను సమకూర్చిన అసాధ్యుడు.. అఖండుడు..'కృష్ణ'. సాంఘికాలు, సాహసచిత్రాలు..చారిత్రిక చిత్రాల్లోనే కాదు.. కౌబాయ్, క్రైమ్.. వంటి చిత్రాలను కూడా సూపర్‌హిట్‌లు చేసి సూపర్‌స్టార్ అనిపించుకున్నారు. ఆయన ఎన్నో అవార్డులు సాధించారు. 1976లో 'నటశేఖర' బిరుదుతో ఘనసన్మానం జరిగింది. 2008లో ఆంధ్ర యూనివర్శిటీ 'కళాప్రపూర్ణ డాక్టర్' అవార్డునిచ్చి అభినందించింది. 2008లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించింది. 2009లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'పద్మభూషణ్' పురస్కారాన్నిచ్చి గౌరవించింది.

## తేనెమనసులతో సినీరంగ ప్రవేశం

కృష్ణ.. పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణ. గుంటూరుజిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో 1942 మే 31న జన్మించారు. 1965లో 'తేనెమనసులు' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసి తెలుగు సినీరంగంలో సూపర్‌స్టార్‌గా అత్యంత ప్రజాదరణ పొందారు. ఆ తర్వాత 1966లో 'గూఢచారి 116' చిత్రం విడుదలై సంచలన విజయం సాధించింది. ఆ చిత్రం ఆయనకు 'జేమ్స్‌బాండ్'గా పేరుతేవడమే కాక, సినీరంగంలో ఆయన సుస్థిరస్థానం సాధించేందుకు దోహదం చేసింది. ఈ చిత్ర విజయంతో కృష్ణ ఒకేసారి 20 సినిమాల్లో హీరోగా సువర్ణావకాశాలు లభించాయంటే ఆ చిత్రం ఎంత జనాదరణ పొందిందో అర్థమవుతుంది. ఆ తర్వాత అదే తరహాలో మరో 6 జేమ్స్‌బాండ్ చిత్రాల్లో నటిస్తే అవన్నీ కూడా విజయం సాధించడం విశేషం. అదేవిధంగా తొలి తెలుగు కౌబాయ్ సినిమా 'మోసగాళ్ళకు మోసగాడు' మరో హిట్ కొట్టింది. క్రైమ్ చిత్రాల నటునిగా కూడా కృష్ణ మరో ప్రఖ్యాతిని సాధించారు. 'పగ సాధిస్తా' సినిమా సూపర్‌హిట్ కావడం, అనంతరం మరో 8 క్రైమ్‌చిత్రాల్లో హీరోగా ఆయనకు అవకాశం రావడం.. ఇలాంటివన్నీ కృష్ణ విలక్షణ నటనా వైభవానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు.

## వినూత్న ప్రయోగాలకు ఆద్యుడు

అసామాన్యమైన నటనా ప్రతిభ ఆయన సొంతం. దాదాపు 350కి పైగా చిత్రాల్లో నటించారు. 16 సినిమాలకు స్వయంగా దర్శకత్వం వహించారు. సినీ రంగంలో అనేక రకాల వినూత్న ప్రయోగాలకు ఆయనే ఆద్యుడు. తెలుగులో తొలి జేమ్స్‌బాండ్ సినిమా 'గూఢచారి 116', తొలి కౌబాయ్ సినిమా 'మోసగాళ్ళకు మోసగాడు', తొలి ఫుల్‌స్కోప్ సినిమా 'అల్లూరి సీతారామరాజు', తొలి 70ఎంఎం సినిమా 'సింహాసనం'తో పాటు కృష్ణ సినీరంగంలో కొత్త కొత్త ప్రయోగాలకు నాందిపలికారు. ఏ సాహసప్రయోగం చేసినా దాదాపు అన్నీ విజయవంతంగానే చేశారు. ఎంతో కష్టతరమైన, విభిన్నమైన పాత్రలు పోషించారు. 1964 నుంచి 1995 దాకా సగటున పదేళ్ళకు వంద సినిమాల్లో నటించారు. ఏడాదికి 10 సినిమాల వంతున 300 సినిమాలు పూర్తిచేశారు. ఇందుకోసం మూడుషిఫ్టులలో అహరహం శ్రమించారు. తనదైన ప్రత్యేక బాణీతో 'హిట్ చిత్రాల హీరో'గా పేరుగాంచారు. 1970లో సొంతంగా హైదరాబాద్‌లో పద్మాలయ స్టూడియో నిర్మించారు. కృష్ణ నటించిన, లేదా తీసిన సినిమాల్లోకెల్లా అత్యంత ప్రభావవంతమైన సినిమా 'అల్లూరి సీతారామరాజు'. ఈ చిత్రం తెలుగునాట మార్మోగింది. ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. రికార్డు స్థాయిలో లక్షలాదిమంది అభిమానులు, వేలాది అభిమానసంఘాలు ఆయన సొంతం. నటశేఖరునిగానే కాక మంచి నాయకునిగా కూడా కృష్ణ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. ఏలూరు పార్లమెంట్ స్థానానికి పోటీచేసి విజయం సాధించి ఎంపీ అయ్యారు. వ్యక్తిగత జీవితంలో ఆయన అనేక ఒడిదుడుకులను చవిచూశారు. ఇరువురిని వివాహం చేసుకున్నారు. మొదటి భార్యపేరు ఇందిర. జీవితభాగస్వామిని విజయనిర్మల. వీరిరువురు కూడా కొంతకాలం క్రితం మరణించారు. కృష్ణ నటవారసునిగా ఇప్పుడు సూపర్‌స్టార్ మహేష్‌బాబు చిత్రసీమలో అద్వితీయంగా రాణిస్తూ తండ్రికి తగ్గ తనయునిగా ఉంటూ..తండ్రిపేరు నిలబెడుతున్నారు.



## లాయర్‌తో నటశేఖరుడి అనుబంధం

**సగం దూరం కారులో వచ్చి, వాన కారణంగా వెనక్కి చెన్నై వెళ్ళి, రైల్లో నెల్లూరుకి వచ్చి తుంగా పండుగలో పాల్గొని 'లాయర్' వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి స్మారక 'తుంగా అవార్డు' అందుకున్న మాటతప్పని మంచిమనిషి కృష్ణ.**



తుంగా అవార్డు అందుకుంటున్న కృష్ణ

సూపర్ స్టార్ కృష్ణతో 'లాయర్'కి అపురూప ఆత్మీయ అనుబంధం ఉంది. 1998 నవంబర్ 8న జరిగిన తుంగా రాజగోపాలరెడ్డి 68వ జయంతి వేడుక 'తుంగా పండుగ'లో కృష్ణ పాల్గొన్నారు. ఆయన నెల్లూరుకు రావడం అదే చివరిసారి. ఆయనకు అత్యంత ఆప్తమిత్రులు, మన నెల్లూరీయులు, తుంగా కుటుంబానికి ఆత్మబంధువు డాక్టర్ సిఎంకెరెడ్డి - నిర్మల దంపతులు తోడురాగా కృష్ణ - విజయనిర్మల జంట నెల్లూరుకు వచ్చి తుంగా పండుగకు కళ తెచ్చారు. సుప్రసిద్ధ కవి, సినీ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సంబరంలో తుంగా రాజగోపాలరెడ్డి స్మారక మూడవ 'తుంగా అవార్డు'ను కృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని, ఆయన ద్వారా 'లాయర్' సంపాదకులు ప్రభుతో ఉన్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. బ్రతికున్న అమ్మా, నాన్నలను వృద్ధాశ్రమాలలో చేర్పిస్తున్న రోజుల్లో దివంగతులైన నాన్న గుర్తుగా ఇలా ఆయన పుట్టినరోజుని జరపడం మంచి విషయమని ఆ సభలో మాట్లాడిన కృష్ణ, విజయనిర్మల ప్రశంసించారు.

## కారులో బయలుదేరి, వెనక్కు వెళ్లి రైల్లో వచ్చారు

సినిమా వాళ్లంటే అహంకారానికి ప్రతిరూపాలు, గర్వం వాళ్ళకు అలంకారం. ఏదైనా కార్యక్రమానికి పిలిస్తే వస్తామని చెప్తారు. చిన్న కారణం దొరికినా ఆ సాకు చెప్పి మానుకుంటారు. అలాంటి గుణాలు, అవలక్షణాలు భూతద్దం పెట్టి వెతికినా కృష్ణలో కనిపించవు. 1998లో జరిగిన లాయర్ 'తుంగా పండుగ' అందుకు పెద్ద ఉదాహరణ. నిజానికి నవంబర్ 8 సాయంత్రం పురమందిరంలో ఆ వేడుక జరగాలి. కార్యక్రమానికి ఒకరోజు ముందు నుండి అతి భారీ వర్షాలు చెన్నై, నెల్లూరు నగరాలను అతలాకుతలం చేసేశాయి. తుంగా పండుగలో పాల్గొనడానికి సిఎంకె రెడ్డి, కృష్ణ దంపతులు మద్రాసు నుండి కారులో బయలుదేరారు, దాదాపుగా సరిహద్దు సమీపానికి వచ్చారు. అక్కడే చిక్కొచ్చింది, భారీ వర్షాలతో వచ్చిన వరద కారణంగా గుమ్మడిపూడి సమీపంలో ఉన్న 'కార్నోడై' వద్ద బ్రిడ్జీ కూలిపోయింది. నెల్లూరు - మద్రాసుల మధ్య రోడ్డు మార్గం బందైపోయింది. ఈ కారణం చాలు ఆయన కార్యక్రమానికి రాలేకపోతున్నానని చెప్పడానికి. కానీ, 'మన కోసం వాళ్ళు ఏర్పాట్లు చేసుకుని ఉంటారు, వెళ్ళకపోతే నిరుత్సాహపడతారు, రైల్లో వెళ్దాం' అని సిఎంకె రెడ్డికి చెప్పి అప్పటికప్పుడు పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో టిక్కెట్లు బుక్ చేయించుకుని సాయంత్రం 5 గంటలకల్లా నెల్లూరుకు చేరుకున్నారు. పురమందిరం నుండి వేదిక కస్తూరిబా కళాక్షేత్రానికి మారింది. సాయంత్రం 5 గంటలకల్లా ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. ఆనాటి 'తుంగా పండుగ' అంగరంగ వైభవంగా జరిగింది.

మాటతప్పని మంచి మనిషి, విలువలున్న మహామనీషి, తెరపై తప్ప నిజ జీవితంలో నటించడం తెలియని మానవీయ వ్యక్తి 'సూపర్ స్టార్ కృష్ణ' అని చెప్పడానికి మచ్చుకు ఈ ఒక్క సంఘటన చాలు.



మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి కుటుంబసభ్యులతో కృష్ణ, విజయనిర్మల దంపతులు




తుంగా పండుగ వేదికపై కృష్ణ, విజయనిర్మల, డా. సి.నారాయణరెడ్డి తదితరులు



లాయర్
నవంబర్ 18, 2022

# ప్రపంచశాంతి కోసం.. భారత్ అడుగులు

ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోంది. అనేక దేశాల్లో జటిలమవుతున్న రకరకాల సమస్యలు, ఆహారం-ఇంధనం తదితర అనేక సంక్షోభాలు, మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, మానవాళి మనుగడకే ముప్పు తెచ్చేలావున్న వాతావరణ మార్పులతో అంతకంతకూ వేడెక్కుతున్న ప్రకృతి వాతావరణం, పెనుముప్పుగా మారుతున్న ఆర్థికమాంద్యం, ఇంకోవైపు ఇంకా భయంకరంగా కోరలు చాస్తూనే ఉన్న కరోనా..ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పుడు ప్రపంచం బాధల వలయంలో విలవిలలాడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచానికి ధైర్యం చెప్తూ, అందరం కలిసి సమస్యలను అధిగమిద్దాం.. ఆందోళనకరమైన అన్ని అంశాలను చక్కదిద్దుకుందామంటూ ప్రపంచదేశాలకు భరోసా ఇస్తోంది భారత్ ఒక్కటే కావడం విశేషం. అంతేకాదు ప్రపంచమంతా బాగుండాలనే సమున్నత లక్ష్యంతో ప్రపంచశాంతి కోసం అడుగులు వేస్తున్న భారతను ప్రపంచమంతా ఇప్పుడు రెండుచేతులా ఆహ్వానిస్తోంది. జి-20 దేశాల శిఖరాగ్రసదస్సులో పాల్గొనేందుకు ఇటీవల ఇండొనేషియాలోని 'బాలి' ద్వీపానికి వెళ్ళిన భారత ప్రధాని మోడీకి అఖండస్వాగతం లభించింది. అనేకదేశాలు పాల్గొన్న అత్యున్నతమైన ఆ సదస్సులో భారత ప్రధాని మోడీ పాల్గొని చేసిన ప్రసంగాలు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోతున్నాయి. 'సవాళ్ళు ఎన్నున్నా ధైర్యంగా ఎదుర్కొందామని, ప్రపంచశాంతి కోసం అందరం కలిసికట్టుగా కృషిచేద్దామంటూ' ప్రధాని మోడీ ఎంతో భరోసాగా ఇచ్చిన పిలుపుకు అన్నిదేశాల అధినేతల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. 'ప్రపంచమంతా ఒకటే. ఒకే భూమి, ఒకే కుటుంబం. ఒకే భవిష్యత్తు!.. అదే వసుధైక కుటుంబం..అదే భారత్ సంకల్పం'.. అంటూ మోడీ చేసిన ప్రసంగానికి అన్ని దేశాలు జేకొట్టాయి. అంతేకాదు, ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి దౌత్యమార్గంలో ముగింపు పలకాల్సిన అవసరం ఉందని మోడీ సూచించడమే కాక, కొత్త ప్రపంచాన్ని అందరం కలసి ఆవిష్కరించుకోవాల్సి ఉందని, భూమిపై శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని కోరడం అన్ని దేశాల నేతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మైత్రీబంధాన్ని బలోపేతం చేసుకుంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని మోడీ సుదీర్ఘంగా చర్చలు జరపడం, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కరచాలనం చేసుకోవడం, ఇరువురూ శుభాకాంక్షలు చెప్పుకోవడం, గతనెలలోనే బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన తొలి భారత సంతతి నేతగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్-ప్రధాని మోడీ ఇరువురూ కలిసి ఎంతో ఉత్సాహంగా మాట్లాడుకోవడం అందరి దృష్టినీ ఆకట్టుకుంది. ఏదేమైనా, 1999లో జి-20 దేశాల కూటమి ఏర్పడిన తర్వాత తొలిసారిగా భారత్ జి-20కి అధ్యక్షస్థానం అధిష్ఠించనుండడం ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సంతోషాన్ని, సంచలనాన్ని కలిగిస్తోంది. జి-20 కూటమిలో అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఇ.యు), యునైటెడ్ కింగ్‌డం (యు.కె), రష్యా, చైనా, ఇండియా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, కొరియా, మెక్సికో, సౌదీఅరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ప్రపంచంలో మూడింట రెండు వంతుల జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న జి-20, ప్రపంచ జీడీపీలో 85 శాతం వాటా కలిగి ఉంది కూడా. ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన జి-20 దేశాల కూటమికి వచ్చే డిసెంబరు 1 నుంచి భారత్ అధికారికంగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే అద్భుత అవకాశం కలగడం.. చరిత్రాత్మకమైన విషయం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల అమృత మహోత్సవాల సందర్భంలో ఈ అరుదైన గౌరవం లభించడం భారతీయులందరూ గర్వపడాల్సిన అంశం. అనాదిగా శాంతికి-సామరస్యానికి నిలయంగా ఉంటూ మహాత్మాగాంధీజీ అడుగుజాడల్లో నడిచే భారత్..ఇక జి-20 వేదిక ద్వారా ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించగల అత్యున్నతమైన ప్రజ్ఞాపాటవాలతో ముందడుగు వేస్తుండడం శుభపరిణామం. సభ్యదేశాల్లో నెలకొన్న అంతర్గత విభేదాలను, సమస్యలను పరిష్కరించుకునే దిశగా, అన్నిదేశాల సహకారంతో జి-20 సదస్సులు ఫలవంతం కావాలని, సమస్యల నుంచి గట్టెక్కి ప్రపంచానికి మంచి భవిష్యత్తు ఉండాలని, ప్రపంచ మానవాళి అంతా ఆ నూతన శుభోదయం కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో, భారత్ ప్రపంచానికి ఆశాకిరణంగా మారింది. అంతేకాదు, ఎప్పుడూ శాంతిని కోరుకునే భారత్ మార్గదర్శనంపై.. మునుపటికంటే ఇప్పుడు ప్రపంచ ప్రజలకు ఒక భరోసా.. ఒక గట్టి నమ్మకం కలుగుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## హడలెత్తిస్తున్న..డేంజరస్ 'డ్రగ్స్'



నేటి సమాజంలో ఒక పెద్ద ప్రమాదకర సమస్య ఏదైనా ఉందంటే..అది మాదకద్రవ్యాలే. వీటినే 'డేంజరస్ డ్రగ్స్' అంటారు. ఒక్కసారి వాడితే చాలు..గమ్మత్తుగా ఉంటుందనే భ్రమలో పడితే, ఇక అవి నెమ్మదిగా శరీరాన్ని విషపూరితం చేసి ఆరోగ్యాన్ని మట్టుపెట్టి, ఆ తర్వాత ప్రాణాల్ని కూడా చుట్టచుట్టి మట్టిలో కలిపేస్తాయి. ఒక్కసారి ఆ 'డ్రగ్స్' జోలికి వెళ్ళామా..ఇక బయటపడేదే ఉండదు. అవి మనుషుల్ని సైకోలుగా మార్చేస్తాయి. పిచ్చిపట్టిస్తాయి. ఇళ్లు-ఒళ్లు గుల్ల చేసేదాకా వదలవు. చివరికి పిచ్చోళ్ళుగానో, బిక్షగాళ్ళుగానో చేసేస్తాయి. అంతటి ప్రమాదకరమైన డ్రగ్స్‌ను 'ఎవరెట్ట సచ్చినా మాకేం.. మాక్కావాల్సింది డబ్బే' అనుకునే కొంతమంది నీచులు వాటిని ఎక్కడెక్కడినుంచో తెచ్చి రహస్యంగా చీకటిమార్గాల్లో సైగ్గా అమ్మేస్తూ అక్రమంగా డబ్బు సంపాదించుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. తెలిసీ తెలియక వాటిని వాడేవారు మాత్రం నానారకాల రోగాలతో కుక్కచావు చస్తున్నారు. ఎంతోమంది విద్యార్థులు..డబ్బుపెట్టి కొనుక్కుని మరీ ఈ దరిద్రాన్ని నెత్తికి చుట్టుకుంటున్నారు.

### మత్తులో చిత్తవుతున్న విద్యార్థులు

మాదకద్రవాల్లో చాలా రకాలున్నాయి. వీటిలో గంజాయి, నల్లమందు వంటి ప్రమాదకరమైన మత్తుమందుల్ని మార్కెట్లో ఎవరికీ తెలియకుండా దొంగతనంగా అమ్ముతుంటారు. వీటితోపాటు హెరాయిన్, కొకైన్, చరస్ ఇలా రకరకాల పేర్లతో ఉంటాయి. కొన్నిచోట్ల ఇంజెక్షన్లు, టాబ్లెట్లు, పౌడర్ రూపంలోనూ అమ్మేస్తుంటారు. పేర్లు ఏవైనా..అన్నీ ఆరోగ్యాన్ని నాశనం చేసే విషాలే!.. ఇలాంటివన్నీ మాదకద్రవ్యాల

## సమస్యల తో 'రణం'

కిందికి వస్తాయి. వీటన్నిటినీ ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. వీటిని తయారుచేసినా, కొన్నా, అమ్మినా, వాడినా నేరమే. పట్టుబడితే కఠిన దండనలుంటాయి. ఇవే కాక నిషేధిత పొగాకు ఉత్పత్తులు కూడా మనిషి ఆరోగ్యానికి పొగబెడుతుంటాయి. వీటన్నిటిపట్ల కూడా అందరూ అప్రమత్తంగా ఉండాలి. మాదకద్రవ్యాలను ఒకసారి అలవాటు చేసుకున్నాక, ఇక వదిలించుకోవడం అంత సులభం కాదు. దానినే 'డ్రగ్ అడిక్షన్' అంటారు. ఆ మత్తు కోసం కొంతమంది లేనిపోని నేరాలకు ఘోరాలకు కూడా పాల్పడుతున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత వారి అవసరాల కోసం సంఘవిద్రోహకుల మాయమాటలు నమ్మి అసాంఘికశక్తులుగా కూడా మారిపోతున్నారని నిపుణులు చెప్తున్నారు. కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు కొంతమంది చదువును గాలికొదిలేసి మత్తుమందుల విషవలయంలో చిక్కుకుంటున్నారని సమాచారం. సొంత ఊర్లు వదిలేసి, తల్లితండ్రులకు దూరంగా ఇతర పట్టణాలు, నగరాలకు వెళ్ళి చదువుకునే అనేక మంది విద్యార్థులు, ఉన్నత చదువులు చదువుకునేవారు కూడా.. తమనిక అడిగేవారెవరూ లేరనే ధీమాతో రకరకాల దురలవాట్లకు, మాదకద్రవ్యాలకు అలవాటు పడిపోతున్నారని సర్వత్రా ఆందోళనగా ఉంది.

### నగరంలోనూ రహస్యంగా..

నెల్లూరు నగరంలోనూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా హైస్కూళ్ళు, కాలేజీల వద్ద రహస్యంగా వీటిని అమ్ముతున్నారని, విద్యాసంస్థల వద్ద మాటువేసి విద్యార్థులను, యువతను మాయమాటలతో ఆకట్టుకుంటూ, గుట్టుచప్పుడు కాకుండా వారికి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి తదితర మాదకద్రవ్యాలను అందజేస్తున్నట్లు తెలుస్తోందని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమాజంలో చాపకింద నీరులా అక్రమమూఠాలు, డ్రగ్స్ మాఫియా వంటివి పోలీసుల కంటపడకుండా తమ పని కానించేస్తుంటాయి. కనుక, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమై నిఘాబృందాలను రంగంలోకి దింపాలని, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ ముఠాల కదలికలను కనిపెట్టి, వారి ఆటకట్టించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా కాలేజీల్లో ఫ్యాషన్‌గా చదువుకునే విద్యార్థులు, ధనవంతుల పిల్లలు, డబ్బుకు కొదవలేని జల్సారాయుళ్ళు ఎక్కువగా ఈ భయంకరమైన దురలవాటుకు బానిసలైపోతున్నారని తెలుస్తోంది. అందువల్ల తల్లితండ్రులు కూడా వీటి పట్ల మెలకువతో ఉండి, తమ బిడ్డలు ఎక్కడికి వెళ్తున్నారో, ఏం చేస్తున్నారో, వారి ఆరోగ్యం-చదువు ఎలా ఉంటున్నాయో.. ఇలా అన్ని విషయాలను అనుక్షణం గమనిస్తుండాలి. తేడా వస్తే అశ్రద్ధ చేయకుండా అసలేం జరుగుతోందో ఆరా తీయాలి. పిల్లలు ఒంటరిగా లేకుండా, మానసిక-శారీరక సమస్యలకు లోనుకాకుండా జాగ్రత్త వహించాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా విద్యాలయాల్లో వారి ప్రవర్తనను ఒక కంట గమనిస్తూనే ఉండాలి. ఏదేమైనా, తమ పిల్లలు మత్తుపదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులపైనే అధికంగా ఉంది. ఎందుకంటే, జరగరానిది జరిగిపోయాక బాధపడడం కంటే, ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుజాగ్రత్తతో ఉండడమే శ్రేయోదాయకం కదా!..తల్లితండ్రులూ!..తస్మాత్! జాగ్రత్త!

**- సంచారి**

### కార్పొరేట్ స్కూళ్ళకు ధీటుగా

## కెఎన్ఆర్ మున్సిపల్ స్కూల్

నెల్లూరులో ప్రఖ్యాతిగాంచిన కార్పొరేట్ స్కూళ్ళకు మించి బివినగర్‌లోని కెఎన్ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్ మార్గదర్శకత్వంలో 2010 నుండి 2022 వరకు క్రమం తప్పకుండా జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఘనకీర్తి పొందడం సంతోషకరం. 2010లో స్టేట్ ర్యాంకర్ సుధీర్, ఆ తర్వాత బీటెక్ చదివి 2017లో గేట్ పరీక్షల్లో కూడా దేశస్థాయిలో ర్యాంక్ పొందాడు. 2022లో తర్షశ్రీ అనే అమ్మాయి 600కి 590 మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ పొందింది. కార్పొరేట్ స్కూళ్ళ నుంచి టీసీ తీసుకుని వచ్చి ఇక్కడ చేర్పి ఎంతోమంది తల్లితండ్రులు 8, 9 తరగతుల్లో తమ పిల్లలను చదివించి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తున్నారు. జూన్ 1వ తేదీకల్లా 'నో సీట్స్' అనే బోర్డు అక్కడ కనిపిస్తుంది. ఇదేవిధంగా ఆ స్కూల్ ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశిస్తున్నాను. *- భవానీశంకర్*, **నెల్లూరు.**

## రైల్వే ఫ్లైఓవర్‌లు నిర్మించాలి

వానొస్తే చాలు నెల్లూరు రెండు ముక్కలైపోతుంది. పడమటి ప్రాంతం వారు తూర్పువైపుకు రావాలంటే నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఒక్క అయ్యప్పగుడి వద్ద తప్ప అన్ని చోట్లా రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉండటమే దీనికి కారణం. వర్షమొస్తే అన్ని అండర్ బ్రిడ్జిలు నీటి మడుగులతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఆలోచించి రైల్వే ఫ్లైఓవర్‌లు నిర్మిస్తే బాగుంటుంది. *టి.సుబ్రహ్మణ్యం*, **నెల్లూరు.**

## నాలుగు జోన్లు ఎందుకు చేయకూడదు?




రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి విశాఖ, అమరావతి, కర్నూల్‌లలో 3 రాజధానులు ఏర్పాటు చేయాలన్న దృఢ నిశ్చయంతో ఉంది వైసీపీ ప్రభుత్వం. పాలనా సౌలభ్యం కోసం వికేంద్రీకరణ మంచిదే. అయితే, పరిపాలక రాజధాని విశాఖ ద్వారా ఉత్తరాంధ్రకు, శాసన రాజధాని అమరావతి కారణంగా కృష్ణా, గుంటూరు పరిసర ప్రాంతాలకు, న్యాయ రాజధానిగా కర్నూలుని చేయడం వల్ల కడప, కర్నూలు అనంతపురం జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుంది. మధ్యలో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు ప్రజలు ఏం పాపం చేశారు...? ఎలాగూ విభజిస్తున్నారు కాబట్టి మూడుకి బదులుగా 4 జోన్లుగా విభజించి నాలుగు రాజధానులను ప్రకటిస్తే బాగుంటుందేమో. రాజధానుల వల్ల ఆ మూడు ప్రాంతాల జిల్లాలకు మాత్రమే లాభం చేకూరుతుంది, మధ్యలో ఈ నాలుగు జిల్లాలు పూర్తిగా నష్టపోయి బలైపోతాయి. చిత్తూరు, తిరుపతి, ఒంగోలు , నెల్లూరు జిల్లాల నాయకులు ఈ వాస్తవాన్ని గ్రహించాలి. అందరూ ఏకమై తమ జిల్లాల దుస్థితిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళి తమ నాలుగు జిల్లాలు నిరాదరణకు గురికాకుండా జాగ్రత్తపడాలి. లేదంటే ఉమ్మడిరాష్ట్ర విభజన తరువాత దిక్కులేకుండా పోయిన నవ్యాంధ్ర తరహాలో ఈ నాలుగు జిల్లాలు కూడా నిరాదారణకు గురై సొంత రాష్ట్రంలో అనాధ జిల్లాలుగా మిగిలిపోతాయి.

*వాయిల మోహనరావు*, **ఒంగోలు.**

# కార్తీకదీపాల శోభతో.. కళకళలాడిన నెల్లూరు

● వేమిరెడ్డి దంపతుల సౌజన్యంతో మూడురోజుల పాటు వైభవంగా లక్షదీపోత్సవం




కార్తీక మాసం సందర్భంగా రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టిటిడి ఢిల్లీ అడ్వయిజరీ బోర్డు కమిటీ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో నెల్లూరు నగరంలోని విఆర్‌సి మైదానంలో లక్షదీపోత్సవం కార్యక్రమం ఈ నెల 11 నుండి 13 వరకు మూడురోజుల పాటు వేడుకగా జరిగాయి. విపిఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు, పలువురు స్వామీజీలు, అనేకమంది ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

తొలిరోజు ఈనెల 11న శ్రీ సిద్ధేశ్వర పీఠాధిపతులు, శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు, జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి, పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ రాధానంద భారతిస్వామిల మంగళాశీస్సులతో, అఖండదీప ప్రజ్వలనతో లక్షదీపోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం గణపతిపూజ చేసి, కలశాన్ని స్థాపించి ఉజ్జయిని మహాశివుని శివలింగాన్ని ప్రతిష్ఠించి స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితులతో మహాశివునికి మహన్యాస పూర్వక శతరుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం మహాశివునికి విశేషంగా భస్మాభిషేకం, ప్రత్యేక హారతులతో పూజలు చేశారు. శివనామ స్మరణలతో మైదానం మార్మోగింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివునికి అభిషేకాలు.. మహావిష్ణువుకు సహస్రనామార్చనలు

రెండవరోజైన ఈనెల 12న మహాశివునికి అభిషేకాలు, మహావిష్ణువుకు సహస్రనామ పూజలు నేత్రపర్వంగా జరిగాయి. దీపోత్సవ ప్రాంగణంలో ముక్తినాథ్ నమూనా దేవాలయాన్ని, మహావిష్ణు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 108 మంది దంపతులతో మహావిష్ణువుకు లక్ష తులసిపూజ నిర్వహించారు. 1008 కమలాలతో సహస్రనామార్చన జరిగింది. మధురభారతి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ వైభవం ప్రవచనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని శివలింగానికి క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి.





## కమనీయం..శివపార్వతుల కల్యాణం

మూడవరోజు ఈనెల 13న శివకేశవులకు పెద్దఎత్తున పూజలు జరిగాయి. తాత్కాలికంగా ప్రతిష్ఠించిన స్ఫటిక శివలింగానికి ఈ మూడు రోజుల పాటు అభిషేకాలు జరిగాయి. అనంతరం 501 మంది దంపతులతో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నయనానందకరంగా జరిగింది. మంత్రమహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతిస్వామి దీపోత్సవానికి విచ్చేసి మహాదీపాన్ని ప్రజ్వలింపజేశారు. లక్షదీపోత్సం ముగింపు సందర్భంగా రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం రమణీయంగా జరిగింది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# ఆత్మీయ కలయిక

శాంతాబయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి గత వారం ఆంధ్రా సీఎం జగన్‌ని కలుసుకున్నారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో వీరిద్దరి భేటీ జరిగింది. దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డితో తమ కుటుంబానికి ఉన్న ఆత్మీయ స్నేహబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి పేరు మీద జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని' తనకు అందచేసినందుకు ముఖ్యమంత్రికి వరప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# 'తంగిరాల మహాభారతం' 30వ భాగం




కుంతి సోదరుడు వాసుదేవుడు, అమూల్య ధన, కనక రాశులతో తన పురోహితుడు కశ్యప మహర్షిని పాండురాజు దగ్గరకు పంపుతాడు. కశ్యప మహర్షి పిల్లలందరికీ ఉపనయనాది వైదిక విధులు నిర్వహించి, వారికి వేదాధ్యయనం ప్రారంభిస్తాడు. పాండురాజు 5గురు పిల్లల్ని, వాళ్ళ ఆటలని చూసి ఆస్వాదిస్తూ తన తపస్సులో మునిగిపోతాడు. వసంత కాలం వస్తుంది. చెట్ల ఆకులు చిగురించి, చిత్ర విచిత్ర పుష్పాలతో వనాలన్నీ విరాజిల్లుతుంటాయి. పాండురాజు, మాద్రితో వనాల్లో విహరిస్తూ, ఆమె అందాన్ని చూసి సమ్మోహితుడై, మృగశాపం మర్చిపోయి, ఆమె ఎంత ప్రతిఘటించినా, వొద్దని వారించినా, కౌగిలించుకుంటాడు. అంతే, కుప్పకూలి మరణిస్తాడు. కుంతికి తెలిసి ఏడుస్తూ, భర్త లేకపోతే జీవించలేనని, తనకింక మరణమే శరణ్యమని, పిల్లల్ని చూసుకోమని చెపుతుంది. కానీ మాద్రి ఒప్పుకోక, పాండురాజు మరణానికి తనే కారకురాలని, తనకు పిల్లల్ని చూసే శక్తి లేదని, పిల్లల్ని కుంతికి అప్పగించి అందరి దగ్గర సెలవు తీసుకుని పతితో పాటు సహగమనం చేస్తుంది. శతశృంగ మునులు పాండురాజుకి, మాద్రికి దహన సంస్కారాలు చేస్తారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.

# శ్రీసిటీలో ప్రధాన ఎగుమతి సంస్థగా.. ఆస్ట్రోటెక్ స్టీల్స్



ఆస్ట్రోటెక్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, 'మేక్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్' స్ఫూర్తితో ఇంజనీర్డ్ న్యూమాటిక్ ఫాస్టెనర్‌లు, స్ట్రక్చరల్ స్టీల్ ఉపకరణాల వంటి వివిధ ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులను అధిక మొత్తంలో ఎగుమతులు చేసి, శ్రీసిటీలోని ఇతర ఎగుమతి కంపెనీలలో అగ్రగామిగా నిలిచింది. శ్రీసిటీలోని అత్యాధునిక ప్లాంట్ విభిన్న ప్రయోజనాలకు అనుగుణంగా 200 రకాల ఇంజనీర్డ్ న్యూమాటిక్ ఫాస్టెనర్‌లు, నెయిల్స్ మరియు స్క్రూలను, స్ట్రక్చరల్ స్టీల్ ఉపకరణాల ఉత్పత్తులను, సగటున ప్రతి నెలా 170 కంటెయినర్లలో (దాదాపు 5,000 టన్నుల బరువు) ఎగుమతి చేస్తోంది. ఈ కంపెనీ ఉత్పత్తులను ఎక్కువగా గృహనిర్మాణం, పారిశ్రామిక మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో విరివిగా ఉపయోగిస్తారు.

తాము అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూ.కే, నెదర్లాండ్స్, జర్మనీ, దక్షిణ కొరియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న వివిధ గ్లోబల్ క్లయింట్‌లకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ ఒరిజినల్ ఎక్విప్మెంట్ తయారీ పరిశ్రమలకు (ఓ.ఈ.ఎం) తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని సీనియర్ అధికారి అరుణ్ మిరాండా చెప్పారు. అందుకు తిరుపతి, నెల్లూరు మరియు ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుండి, పొరుగున ఉన్న తిరువళ్లూరు ప్రాంతం నుండి నైపుణ్యం కలిగినవారి లభ్యత వల్ల వేగంగా తమ కంపెనీ సామర్థ్యాలను పెంపొందించుకోగలుగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇది శ్రీసిటీలోని అన్ని పారిశ్రామిక యూనిట్లకు ఒక వరంలాంటిదన్నారు. అత్యుత్తమ పనితీరు మరియు వారికృషికి ఫలితంగా ఆస్ట్రోటెక్ స్టీల్స్ ఈ ఘనత సాధించిందని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. ఈ కంపెనీ, సంవత్సరానికి సగటున 50,000 మెట్రిక్ టన్నుల వివిధ గ్రేడ్‌ల స్టీల్‌ను ప్రాసెస్ చేస్తున్నదని, ఆస్ట్రోటెక్ స్టీల్స్ గత ఆర్థిక సంవత్సరంలో 40% వార్షిక వృద్ధిని సాధించిందని ఆయన వివరించారు. శ్రీసిటీలో ఒకటైన ఆస్ట్రోటెక్ స్టీల్స్ అత్యధిక ఎగుమతులతో అగ్రస్థానంలో నిలవటం శ్రీసిటీకి గర్వకారణమన్నారు.






# నెహ్రూజీ సేవలు చిరస్మరణీయం

**డిసిసి నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి నివాళి**

దేశానికి జవహర్‌లాల్ నెహ్రూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. నెహ్రూజీ 133వ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశంలోని బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, పంచవర్ష ప్రణాళికలు చేపట్టి దేశాభ్యున్నతికి బాటలు వేశారని పేర్కొన్నారు. బాలలంటే ఆయనకెంతో ఇష్టమని, అందుకే నెహ్రూజీ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకర మన్నారు. తొలుత, నెహ్రూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పేదలకు అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీవి శేషారెడ్డి, పీసీసీ సభ్యుడు టి.బాలసుధాకర్, కిసాన్ సంఘం అధ్యక్షులు ఏటూరు శ్రీనివాసులురెడ్డి, సిటీ ఇన్‌చార్జి ఫయాజ్, పప్పర్తి గణేష్‌బాబు, అల్లావుద్దీన్, మహేష్‌రెడ్డి, పవన్‌కుమార్, రాజేష్‌రెడ్డి, రామకృష్ణ, సాయికృష్ణ, మహబూబ్ బాషా, మున్నా హరిబాబు, ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన.. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



నెల్లూరు నగర డిఎస్పీగా డి. శ్రీనివాసరెడ్డి ఇటీవల నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలంలోని అరవల్లి గ్రామం. 1991లో పోలీసుశాఖలో ఎస్ఐగా చేరారు. ఆ తర్వాత 2009లో సిఐగా, 2014లో డిఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు. విజయవాడ క్రైమ్ బ్యూరోలో ఏసీపీగా రెండు సంవత్సరాలు పనిచేసిన అనంతరం 2016లో రాజమండ్రికి బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీల్లో ఆయన నెల్లూరు డిఎస్పీగా నియమితులై ఇక్కడికి వచ్చారు. కొత్త డిఎస్పీ శ్రీనివాసరెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు!..

# టెన్త్ టాపర్‌కి..భవానిశంకర్ బహుమతి

నవంబరు 14 జవహర్‌లాల్ నెహ్రూ 133వ జయంతి, పిల్లల పండుగ సందర్భంగా నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న కెఎన్ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో చదివి రాష్ట్రస్థాయి టాప్ ర్యాంకు సాధించిన తర్షక్రీకి విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ భవానిశంకర్, ఆయన తల్లి జ్ఞాపకార్థం ఇస్తున్న స్టేట్ టాపర్ ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఆ పాఠశాల హెడ్మాస్టర్ విజయప్రకాష్ సమక్షంలో ఆ చెక్‌ను ఆ విద్యార్థిని తండ్రికి బహుకరించారు.

# నెల్లూరు కబుర్లు

## సూపర్‌స్టార్ కృష్ణ మృతి.. బాధాకరం

- **రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి సంతాపం**

సూపర్‌స్టార్ కృష్ణ మృతి బాధాకరమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తన సంతాపం వ్యక్తం చేశారు. పాతతరం అగ్రనటుల్లో ఒకరైన కృష్ణ దాదాపు 350చిత్రాల్లో నటించడమే కాక, దర్శకునిగా–నిర్మాతగా కూడా పలు చిత్రాల నిర్మాణాల్లో భాగస్వాము లయ్యారని, సినీపరిశ్రమకు ఆయన చేసిన సేవకు 'పద్మభూషణ్' అవార్డు లభించిందని, ఎంపీగా కూడా ఆయన పనిచేసి ప్రజలకు గొప్ప సేవ చేశారని విపిఆర్ ఈ సందర్భంగా కొనియాడారు. ఆ మహానటుని ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

## అపోలో ఆసుపత్రిలో.. చిల్డ్రన్స్ డే వేడుకలు




నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో నవంబరు 14న చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అపోలో ప్రాంగణం పిల్లల ఆటపాటలతో కళకళలాడింది. శిశు వైద్యులు, సిబ్బంది, నర్సులు పిల్లలతో ఆడి పాడారు. అపోలో ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రూప, డాక్టర్ రఫీ పిల్లల ఆరోగ్యం గురించి తల్లిదండ్రులకు సూచనలు చేశారు. అనంతరం నెల్లూరు అపోలో స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. చిన్నతనం నుంచే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని చెప్పారు. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులపై ఉందని, వారికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాల్సిన బాధ్యత కూడా వారిదేనని అన్నారు.

## విద్యాశాఖ ఏడీగా.. నారాయణరావు

జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్–1గా భీమవరంలో పనిచేస్తున్న కె.నారాయణరావును నెల్లూరులో నియమించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు ఆయన ఇక్కడ నియమితులయ్యారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

## నెహ్రూ యువకేంద్రం.. ఆవిర్భావ దినోత్సవం



నెహ్రూ యువకేంద్రం ఆవిర్భావ దినోత్సవం నెల్లూరులోని ఆ సంస్థ కార్యాలయంలో ఈనెల 14న జరిగింది. అధికారులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ సిఇఓ చిరంజీవి, సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డా. ఉదయ్‌శంకర్, జిల్లా యువజన కేంద్రం అధికారి మహేంద్ర రెడ్డి తదితరులు పాల్గొని యువకేంద్రం ప్రాధాన్యతను తెలియజేశారు. నెహ్రూ యువ కేంద్రాలను 1972లో ఏర్పాటు చేశారని, దేశంలో ప్రస్తుతం 623 జిల్లాలలో నెహ్రూ యువకేంద్రం కార్యక్రమాలను నిర్వహిస్తోందని, యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చెయ్యడం నెహ్రూ యువ కేంద్రాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. అనంతరం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురు యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జర్నలిస్టుల సంఘం నాయకుడు జయప్రకాష్, నోడల్ ఎన్జీఓ సహదేవయ్య పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్‌లో

# 'కృష్ణచైతన్య'..యూనివర్శిటీ ఫస్ట్



విఎస్‌యు ఇటీవల విడుదల చేసిన డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు అన్ని కోర్సులు, గ్రూపులలో యూనివర్శిటీలో టాప్‌మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. బిఎస్సీలో సిహెచ్ అనిత, జె.ప్రవళిక‌లు 99.8 శాతం, ఎస్‌కె ఆఫ్రిన్, టి.రమ్య 99.5శాతం, జి.అంజలి, ఎస్‌డి రఫిత, వి.రూప, ఎం. అలేఖ్య 99 శాతం, జి.మనోహర్, టి.అంజనాదేవి, ఎస్.భరత్‌రెడ్డి, యు.సుమన్ 98 శాతం మార్కులతో యూనివర్శిటీ ఫస్ట్ సాధించారు. అదేవిధంగా బిసిఏలో టి.మహేష్ 99.6శాతం, కె.సహానా, కె.ధరణిఉషా 99.4 శాతం, పి.వి కమల్‌నాగసాయి, ఆర్.జెస్సిక, జె.దాక్షాయణి 98.6 శాతం, పి.కావ్య 98శాతం మార్కులు సాధించి యూనివర్శిటీ ఫస్ట్‌గా రాణించారు. బిఎస్సీ లైఫ్‌సైన్స్‌లో కె.లక్ష్మీప్రసన్న 99.6 శాతం, షేక్ షహనాజ్ 99 శాతం, బిబిఏలో ఎం.శ్రీలేఖ 94 శాతం, కె.సోని 93 శాతం, పి.వసంత లక్ష్మి, పి.సాయిషణ్ముఖనాథ్, ఎం.హర్షిత 91 శాతం, బికాంలో ఎస్.లక్ష్మి 96 శాతం, పి.చందనప్రియ 94 శాతం మార్కులు సాధించి యూనివర్శిటీ టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులందరినీ కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్ రెడ్డిలు అభినందించారు. తమ కళాశాలలోని 9 మంది విద్యార్థులు 99 శాతం పైగా మార్కులు సాధించారని, 22 మంది విద్యార్థులు 98 శాతం పైగా, 156 మంది విద్యార్థులు 95 శాతం పైగా, 507 మంది విద్యార్థులు 90 శాతం పైగా, 1050 మంది విద్యార్థులు 75 శాతం పైగా మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు.

అదేవిధంగా గణితంలో 471 మంది, స్టాటిస్టిక్స్‌లో 144 మంది, అకౌంట్స్‌లో 37 మంది, ఫిజిక్స్‌లో 13 మంది, ఎలక్ట్రానిక్స్‌లో 25 మంది, కెమిస్ట్రీలో ఏడుగురు, బయోటెక్‌లో నలుగురు విద్యార్థులు నూటికి నూరుశాతం మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో అద్భుతాలు సృష్టించారని వారు పేర్కొన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల డీన్ బి.సుధారాణి, అడ్మిన్ డీన్ సి.రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇళ్ల పేరుతో...

# పేదలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

**జనసేన నాయకుడు మనుక్రాంత్ ధ్వజం**

నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలు, వర్షాలొస్తే నీళ్లలో మునిగిపోయే ప్రాంతాల్లో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇళ్ళ నిర్మాణాలు చేయడం దారుణమని జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'జగనన్న ఇళ్ళు–పేదలకు కన్నీళ్ళు' కార్యక్రమంలో భాగంగా ఆయన మూడురోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి జగనన్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఈనెల 14న హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. జగనన్న ఇళ్ళు ఎక్కడా సక్రమంగా కట్టడం లేదని, అస్తవ్యస్తంగా ఈ నిర్మాణాలు చేపట్టడం ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. నాసిరకం కట్టడాలతో ప్రమాదాలకు అవకాశం ఉంటుందని, నిర్మాణాల్లో అవినీతి తారస్థాయిలో జరిగినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగర జనసేన నాయకులు జి.కిషోర్, జీవన్, కోలా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







# ఆరోగ్యశ్రీ ఘనత.. మహానేత వైఎస్‌దే

## మంత్రి కాకాణి




ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదవారికి కార్పొరేట్ అసుపత్రుల్లో వైద్య సేవలు అందేలా కృషి చేసిన ఘనత మహానేత, దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 15న నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో నిర్మించిన గుండాల పద్మనాభరెడ్డి ప్లాటినమ్ బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, ధనవంతులతో సమానంగా నేడు నిరుపేదలు సైతం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఇటీవలికాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధతో ఆరోగ్యశ్రీని నిరుపేద రోగుల కోసం మరింత పటిష్టంగా అమలుచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం 108, 104 వైద్య సేవలతో పాటు ఫ్యామిలి డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికవర్ ఆసుపత్రి అధునాతన వైద్య పరికరాలు, వైద్య సౌకర్యాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి, వైకాపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మెడికవర్ ఆసుపత్రి ఛైర్మన్ డా. అనిల్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. హరికృష్ణ, డా. సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తండ్రిని కోల్పోయిన చిన్నారులకు చేయూత

## ఎమ్మెల్యే ప్రసన్న ఔదార్యం

బుచ్చిరెడ్డిపాలెం మండలం, రేబాల పంచాయతీలోని అరుంధతివాడకు చెందిన దర్శిగుంట చెంచు చైతన్య, దర్శిగుంట నావిష్కల తండ్రి చనిపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్న విషయం తెలుసుకొని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారికి చేయూతనందించారు. తమ తండ్రి స్వర్గీయ నలపరెడ్డి శ్రీని వాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చైతన్యకు రూ. 20వేలు, నావిష్కకు రూ. 20వేలు.. మొత్తం 40వేల రూపాయలను వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకులో జమచేసి, ఆ ఇద్దరు పిల్లలకు 18 సంవత్సరం వచ్చే వరకు ఫిక్స్‌డిపాజిట్ చేయించి ఆ పత్రాలను ఆ పిల్లల తల్లికి అందజేసి ఎమ్మెల్యే ప్రసన్న తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

# భారత ఉప రాష్ట్రపతితో బిఎంఆర్ విందు



భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈనెల 14న న్యూఢిల్లీలో ఇచ్చిన విందులో రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) పాల్గొన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉప రాష్ట్రపతి రాజ్యసభ సభ్యులందరినీ దశలవారీగా కలుస్తూ వారి సమాచారం తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా బీద మస్తాన్‌రావును విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు కుటుంబం గురించి, వారి వ్యాపార మరియు రాజకీయ నేపథ్యాల గురించి ఉప రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు. ఈ విందుకు ఆహ్వానించినందుకు ఉప రాష్ట్రపతికి బిఎంఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ విందులో కేంద్రమంత్రులు, పలువురు రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్ సర్టిఫికెట్లు వచ్చాయి - ఆర్ఐఓ

ఈ ఏడాది మే, ఆగస్టు నెలల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించి ఒరిజినల్ మార్కులిస్టులు, పాస్ సర్టిఫికెట్లు వచ్చాయని ఆర్ఐఓ వరప్రసాదరావు ఈ నెల 15న ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ తమ కార్యాలయం నుంచి ఈ సర్టిఫికెట్లను తీసుకువెళ్లి విద్యార్థులకు అందజేసి, వారి వద్ద నుండి అక్నాలెడ్జ్‌మెంట్‌లను ఆర్ఐఓ కార్యాలయానికి అందజేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించి ఆ సర్టిఫికెట్లను కళాశాలల నుండి పొందాలని ఆయన కోరారు.


## తృతీయ వర్ధంతి



జననం: 21.08.1930 మరణం: 19.11.2019

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

**శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు**

(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి)

మాకు దూరమై నవంబర్ 19, 2022 నాటికి
మూడేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..
ఆమె దివ్య ఆత్మకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల,** చెన్నై

కోడలు
**డా॥ సి.భారతి,** యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)


మనుమరాలు, మనుమడు
**ప్రణీత అరవింద్, లోహిత్,** యు.యస్.ఏ

మనుమడు - మనుమరాలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి,** చెన్నై

మనుమరాలు - మనుమడు
**శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి,** కాకినాడ

మునిమనుమలు, మునిమనుమరాండ్రు
**జయేష్ & అస్మిత      కీర్తన లక్ష్మి & తనవ్**

## కృతజ్ఞతాపూర్వక కలయిక



వెంకటగిరి రాజా శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్(SVBC) ఛైర్మెన్ డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర ముఖ్యమంత్రిని కలిశారు. ఎస్‌విబిసి ఛైర్మెన్‌గా తన పదవీ కాలం మరో ఏడాది పొడిగించినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో సాయికృష్ణ యాచేంద్రతో పాటు ఆయన సోదరులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర కూడా జగన్‌ని కలిశారు.

## శ్రీసిటీలో రక్తదాన శిబిరం

### 180 మంది ఉద్యోగుల రక్తదానం



దేశవ్యాప్తంగా జరుగుతున్న 'స్వచ్ఛత పక్వాడా' సంబరాల్లో భాగంగా శ్రీసిటీలోని డీసీ కార్యాలయ అధికారులు ఈనెల 15న నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి శ్రీసిటీ బిజినెస్ సెంటర్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో సెజ్ డెవలప్‌మెంట్ కార్యాలయం స్పెసిఫైడ్ అధికారి ఎస్.మధుబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ డిఎస్ఎన్ రావ్, ఆథరైజ్డ్ ఆఫీసర్ కె.రామారావు, ప్రివెంటివ్ ఆఫీసర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను శ్రీసిటీ ఎం.డి డా. రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. బాధితుల ప్రాణాలు కాపాడే ప్రక్రియలో రక్తదానం అత్యంత కీలకమన్నారు. ఈ ఉదాత్తమైన సేవలో భాగస్వాములు కావడానికి పరిశ్రమ ఉద్యోగులు పెద్దఎత్తున ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. శ్రీసిటీ సెజ్ పరిధిలోని వివిధ పరిశ్రమలకు చెందిన 180 మంది ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం విశేషం. రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్ఓ ఎం.మధుసూధనరావు, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ చీఫ్ రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఒక్క గళం'...పుస్తకాలు పంపిణీ




భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి 45 సంవత్సరాల రాజకీయజీవితాన్ని, ఆయన జీవిత ప్రస్థానాన్ని కళ్లముందు నిలిపే 'ఒక్క గళం' పుస్తకాలను తెలుగు విజ్ఞానసమితి వారు ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ పుస్తకాన్ని ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సమయంలో వెంకయ్యనాయుడు ఒంగోలులో ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ పుస్తకాలను బెంగుళూరుకు తెప్పించి ఆ సంస్థ సభ్యులకు ఉచితంగా అందజేయడంలో కర్నాటక తెలుగుదేశం పార్టీ కన్వీనర్ రావి మోహనచౌదరి ప్రముఖపాత్ర వహించారు. ఈ పుస్తకంలో వెంకయ్యనాయుడు ప్రజాజీవితానికి సంబంధించిన అరుదైన ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. సమితి సభ్యులకు ఈ పుస్తకాలను అందించిన రావి మోహనచౌదరికి సమితి అధ్యక్షుడు డా.ఏ.రాధాకృష్ణరాజు ధన్యవాదాలు తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## రాజీమార్గం.. రాజమార్గం

గూడూరు కోర్టు ఆవరణలో ఇటీవల జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యారు. రాజీమార్గం ద్వారా ఇరువర్గాలకు అనుకూలంగా న్యాయవాదులు తీర్పు ఇచ్చారు. అదనపు జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం, సీనియర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్, అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ లోకనాథం, గూడూరు బార్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ పెంచలయ్య, అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, భాస్కర్, నాగేశ్వరమ్మ, కొండలరావు, రామసుబ్బయ్య, రజినీకాంత్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మయూరి శ్యామ్‌కు యాదవుల సన్మానం



సౌత్‌సెంట్రల్ రైల్వే, విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్‌గా నామినేట్ కావడమే కాకుండా, 2023-2024 సంవత్సరానికి రోటరీ క్లబ్స్ కోస్టల్‌జోన్‌కు అసిస్టెంట్ గవర్నర్‌గా నామినేట్ అయిన సందర్భంగా శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ బి.శ్యామసుందరరావు(మయూరి శ్యామ్‌యాదవ్)ను గూడూరులోని సొసైటీ కార్యాలయంలో యాదవ యువత రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు మధుబాబుయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అఖిల భారత యాదవ మహా సంఘం నెల్లూరు అధ్యక్షులు లలితారామ్, జాతీయ ఉపాధ్యక్షులు పడ్డల గోపాల్ యాదవ్, మైథిలి హాస్పిటల్ ఎం.డి ఎల్.వి.రమణబాబు, మధు, పులిమి శ్రీనివాసులు, రమేష్‌బాబు, నాగభూషణం, మునిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వశక్తితో ఎదిగిన 'సూపర్ స్టార్'



ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లు ఉన్న సమయంలో స్వశక్తితో ఎదిగి, తనకంటూ చిత్రసీమలో సూపర్‌స్టార్ కృష్ణ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్తంభం కూడలి వద్ద గూడూరు పట్టణ కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన మృతికి సంతాపం తెలుపుతూ కృష్ణ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### బాధ్యతలు స్వీకరించిన

## డిఎస్పీ సూర్యనారాయణ



తిరుపతి జిల్లా గూడూరు డిఎస్పీగా సూర్యనారాయణరెడ్డి ఈ నెల 15వ తేదీ డిఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గుంటూరు డిఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ వచ్చారు. ఇక్కడి డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సూర్యనారాయణరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా గూడూరు రూరల్ సి.ఐ జి.దశరథరామారావు, టూటౌన్ ఎస్సై గోపాల్, 1వ పట్టణ ఎస్సై పవన్‌కుమార్, ఆఫీసు సిబ్బంది జయరామయ్య తదితరులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారులకు రోటరీ దుప్పట్లు






గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ వల్లంకొండ గోపాలకృష్ణమూర్తి జ్ఞాపకార్థం రొటేరియన్ యస్.వి.జి.ప్రసాద్ దాతృత్వంతో ఈనెల 15వ తేదీన స్థానిక నరశింగరావుపేటలోని బాలసదన్‌లోని చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలసదన్ మేనేజర్ కోరికపై గోపాలకృష్ణమూర్తి కుమారుడు వల్లంకొండ ప్రత్యూషకుమార్ బాలసదన్‌కు టెలివిజన్ బహుకరిస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షులు కిరణ్‌చక్రవర్తి, కె.మునిగిరిష్, రొటేరియన్లు బి.దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, పి.వి.కృష్ణయ్య, బి.శ్రీధర్‌రెడ్డి, పి.వి.మోహన్‌రెడ్డి, పి.మునిరాజా, జి.యస్.రాఘవరెడ్డి, యస్.వి.జి.ప్రసాద్, ఎన్.వి.రత్నం, బాలసదన్ ఉద్యోగులు పాల్గొన్నారు.




## పిల్లలు క్రమశిక్షణతో రాణించాలి

గూడూరు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు కళ్యాణసాయి అధ్యక్షతన ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవం జరిగింది. గూడూరు పంచాయతిరాజ్ ఇ.ఇ టి.శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో చదివి అనుకొన్నవి సాధించాలన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ రియాజ్ అహమద్ మాట్లాడుతూ దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అని, ఈ తరం విద్యార్థులకు అలాంటి మహానాయకులను తెలియజేయడానికి లయన్స్ క్లబ్ క్యాలెండర్ ఈవెంట్స్‌లో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన 108 మంది విద్యార్థులకు మెమొంటోలు అందించారు. పాఠశాల పూర్వవిద్యార్థి కోదండరామయ్య దాతృత్వంతో విద్యార్థులకు క్రికెట్ కిట్ మరియు వాలీబాల్ కిట్లు అందించారు. క్లబ్ కార్యదర్శి మునికుమార్, కోశాధికారి రవిచంద్ర, ప్రజా డాక్టర్ చంద్రహాస్, మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, కె.రవికుమార్, మదనమేటి రమణయ్య, ఎం.రూపేష్, షేక్ ఇలియాజ్ అహమద్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయలు ఎండి రవూఫ్, పిల్లలు పాల్గొన్నారు.



తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలిగా ఎన్నికైన చక్రాల ఉష, ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, జిల్లా కార్యదర్శి గుండాల భారతి ఇతర కార్యనిర్వాహక సభ్యులకు అభినందనలు తెలియజేస్తున్న తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధికారప్రతినిధి బిల్లు చెంచురామయ్య

### ఎమ్మెల్సీ ఎన్నికలకు..

# పోలింగ్ కేంద్రాలు సిద్ధం

**జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు**



ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని మౌలిక వసతులు ఉన్న కళాశాలలు, పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసినట్టుగా తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి 1,13,837 మంది, ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 7,783 మంది ఓటర్లుగా నమోదుకు దరఖాస్తులు సమర్పించారన్నారు. వాటిని పరిశీలించి ఈ నెల 19వతేది నాటికి డ్రాఫ్ట్ తయారీని పూర్తిచేసి, 23వ తేదిన ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా ప్రచురిస్తామన్నారు. వాటిపై అభ్యంతరాలను డిసెంబరు 9వతేది వరకు స్వీకరిస్తామన్నారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 25వతేది నాటికి పరిష్కరించి, తుది జాబితాను డిశంబర్ 30న ప్రచురిస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున వై.మురళీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ తరపున వెంకటేశ్వర రెడ్డి, బిజెపి నుండి సిహెచ్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ నుండి బాలసుధాకర్, సిపిఎం నుండి మోహన్‌రావు పాల్గొన్నారు.

# నట విజేత కృష్ణ!



అతడో సముద్రమైన మనిషి
నిత్యం ఏటికి ఎదురీదే పోరాట
పటిమతో చిత్రసీమలో
పరుగులెత్తిన పోరాటపర్వతం
అసంఖ్యాక నిర్మాణాత్మక స్మృతులకు
ఆయనో నిలువెత్తు సంకేతం
'పెద్దన్న'గా ఉమ్మడి కుటుంబ
యుద్ధనౌకను ఒడ్డుకు చేర్చిన
అభినయం ఆయనకే సొంతం
అలాంటి వసంత ఋతువుల
సృష్టిలో ఆయనదో ప్రత్యేకం
జేమ్స్‌బాండ్ పాత్రల వాస్తు తెలిసి
తనకు తాను ఆ పాత్రల్లో కెగిసి
నింగి నుంచి చందమామను జేబులో వేసుకొన్నట్లు
ఆ నటనను తాను అవధరించిన రేడు
రేపటి యుద్ధం కోసం నేటి నిద్ర మానుకొని
నిర్విరామంగా పోరాడిన
అల్లూరి సీతారామరాజు తానై
ఆ భూమికలో ఒదిగిన భాగ్యశీలి!
చిత్రసీమలో కార్మికుల ఆకలి
మంటల అశృవులను చల్లార్చిన
మానవీయ మహనీయుడు...
నిత్యం అతడో సాహస నావికుడు
సినీ సీమలో తొడగొట్టి నిల్చిన మహాయోధుడు
ఆ మహానటుని నిశ్శబ్ద నిష్క్రమణం
ఆంధ్రుల అభిమాన గుండెల్లో
పెనుతుఫానుల ఆవిష్కరణం!



- చిన్ని నారాయణరావు
94402 02942



### కార్పొరేట్ స్థాయిలో..

# భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాల

పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు అత్యాధునిక వసతులతో, 5 కోట్ల రూపాయల వ్యయంతో గొలగమూడిలో అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ వైద్యశాల ప్రారంభం కావడం పట్ల గ్రామీణ ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ వైద్యశాలకు ఆశ్రమ ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యంతో కలసి ఈనెల 13న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ అటు ఆధ్యాత్మికపరంగా, ఇటు సేవాభావంతోను ఆశ్రమ ట్రస్ట్ వారు చేస్తున్న సేవలు అపూర్వమని కొనియాడారు. ప్రత్యేకించి వెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ఇఓ బాలసుబ్రహ్మణ్యం మానవసేవే మాధవసేవ అనే భావనతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని అభినందించారు. ఈ వైద్యశాలలో ఆయుర్వేదం, హోమియోపతి, అల్లోపతి, ఫిజియోథెరపీ, కృత్రిమ అవయవాల ఏర్పాటు తదితర వైద్యసేవలన్నీ పేదలకు ఉచితంగా అందించనున్నారని, పేద ప్రజలకు ఒక్కరూపాయి కూడా ఖర్చులేకుండా వైద్యసేవలందించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా పక్షవాతానికి గురైన వారికి మెరుగైన వైద్యం అందించి, వారు త్వరగా కోలుకునేవిధంగా, కనీసం వారి పనులు వారు చేసుకునేవిధంగా వైద్యం అందించడమే లక్ష్యంగా ఆశ్రమం వారు కృషిచేస్తున్నారని ఆయన తెలిపారు. వెంకయ్యస్వామి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో త్వరలో జూనియర్ కాలేజీ నిర్మాణం కూడా జరగనున్నట్లు మంత్రి చెప్పారు. విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తూ ఆశ్రమం వారు చేపడుతున్న కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తొలుత మంత్రి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటుచేసిన కార్తీక వనభోజనం కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలసి భోంచేశారు. ఇఓ పి,బాలసుబ్రహ్మణ్యంతో పాటు ఆశ్రమ ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్, స్థానిక నాయకులు వెంకటశేషయ్య, ప్రదీప్‌రెడ్డి, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా.. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఈనెల 14 నుంచి 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో బాలబాలికలు పాల్గొని బాలల దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ శారద మాట్లాడుతూ, బాలలందరూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని చెప్పారు. పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు పెట్టారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కుమారి బదలాని కిపిష్ నృత్యప్రదర్శన మెచ్చుకుంటూ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ 2వేల రూపాయలను నగదు బహుమతిగా అందజేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కె.కుమార్‌రాజా, విశ్రాంత గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా.. బాలల దినోత్సవం

నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాలబాలికలు ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులకు పాఠశాల వారు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దశరథరామయ్య, ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## టూకీగా...

### కొండబిట్రగుంట ఆలయానికి..
### 18.32 లక్షల ఆదాయం

బోగోలు మండలం కొండబిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీ లెక్కించగా, గత ఆగస్టు నుంచి నవంబరు దాకా భక్తుల కానుకల ద్వారా ఆలయానికి 18, 32 ,524 రూపాయలు రాబడి వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మెన్ శ్రీరాంమాల్యాద్రి, ఇఓ రాధాకృష్ణ, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### జొన్నవాడలో..
### శ్రీ మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో కొలువైవున్న శ్రీ మల్లికార్జునస్వామికి ఆలయ అర్చకులు ఈనెల 15న అన్నాభిషేకం నిర్వహించి, రుద్రాభిషేకం, సహస్రనామార్చన పూజలు చేశారు. ఉభయకర్తలు, భక్తులు పాల్గొని ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి, స్వామివార్లను దర్శించుకున్నారు.

### క్రాకుటూరు రామాలయంలో.. దొంగలుపడ్డారు

కలిగిరి మండలంలోని క్రాకుటూరు రామాలయంలో ఇటీవల చోరీ జరిగింది. గడ్డపారలతో తాళాలు పగలగొట్టి, దొంగలు లోపలికి వెళ్ళి హుండీని కూడా పగలగొట్టారు. అందులో ఉన్న సుమారు 15వేలను దోచుకుపోయారు. గ్రామపెద్దల సమాచారంతో కలిగిరి ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదుచేసి, దొంగల ఆచూకీ కోసం గాలింపు ప్రారంభించారు.

### మన్నేటికోటలో ఉచిత వైద్యశిబిరం

ఉలవపాడు మండలం, కరేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మన్నేటికోటలో ఇటీవల ఉచితవైద్య శిబిరం నిర్వహించి రోగులకు ఆరోగ్యపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. డాక్టర్ శ్రీనివాసరావుతో పాటు 104 వాహనం వైద్యులు లక్ష్మీనరసింహం, సచివాలయ ఏఎన్ఎం శోభాదేవి, ఎంఎల్ పిహెచ్ రాఘవశ్రీ, అల్తాఫ్, ఆశాకార్యకర్తలు పద్మావతి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతిరాజ్ ఇంజనీర్ల.. కొత్త కార్యవర్గం

ఏపి పంచాయతిరాజ్ ఇంజనీర్ల జిల్లా సంఘానికి ఇటీవల కొత్త కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షులుగా ఎం.బాబురావు, కార్యదర్శిగా ఎన్.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. వైస్‌ప్రెసిడెంట్‌గా ఎస్ సుధాకర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా మన్మథయ్యలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఉద్యోగులు అభినందించారు.

### అన్నారెడ్డిపాళెంలో బీసీ హాస్టల్ తనిఖీ

సంగం మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఇటీవల బీసీ సంక్షేమాధికారి వై.వెంకటయ్య తనిఖీ చేశారు. వసతులు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ట్యూటర్లను ఏర్పాటు చేసిందని, బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు.

### మనుబోలులో..గంగమ్మకు ప్రత్యేకపూజలు

మండల కేంద్రమైన మనుబోలు చెరువుకట్టపై వెలసిన గ్రామదేవత గంగమ్మకు ఈనెల 13న ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి క్షీరాభిషేకం చేసి, కుంకుమార్చన నిర్వహించారు. ఈ పూజలకు గూడూరు పెంచలయ్య–జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### మర్రిపాడులో.. మందాడి సంతాపసభ

మర్రిపాడు మండలంలోని కేతిగుంట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మందాడి నర్శింహులునాయుడు ఇటీవల ఆకస్మికంగా మరణించారు. స్థానిక నాయకులు, పలు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 13న సంతాపసభ ఏర్పాటుచేసి మందాడి సేవలను కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు వివి శేషు, మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లా!.. కామకేళీ కేంద్రాలా?

- ప్రైవేట్ పాఠశాలల్లో మృగాళ్ళు
- 'ఒవెల్' స్కూల్‌లో చిన్నారిపై ఘాతుకం
- మండిపడుతున్న ప్రజలు.. ప్రజాసంఘాలు



*'జిల్లాలో కొన్ని ప్రైవేట్‌స్కూళ్లు కామకేళీకేంద్రాలుగా మారుతున్నాయి. చిన్నారులకు భద్రత ఉండడం లేదు. పిల్లలకు పాఠాలు చెప్పకుండా వారిపై అశ్లీలంగా, అనైతికంగా ప్రవర్తిస్తున్నారు. ఇవి స్కూళ్లేనా?..మరీ ఇంత దారుణమా?'..అంటూ ప్రజలు, చిన్నారుల తల్లితండ్రులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నిర్లక్ష్యపు నిర్వాహకులు, కొన్నిచోట్ల సిబ్బంది, గురువుల అసభ్య ప్రవర్తనలతో ఆయా పాఠశాలలకే చెడ్డపేరు వస్తోంది. పాఠశాలల్లో బాలికలు, విద్యార్థినులపై లైంగికవేధింపులు తరచూ జరుగుతుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది. నెల్లూరు నగరంలోని ఒవెల్-14 పాఠశాలలో ఇటీవల ఓ చిన్నారిపై ఆ పాఠశాల పిఆర్‌ఓ లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన జిల్లావ్యాప్తంగా ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. జిల్లా పోలీసులు, ఉన్నతాధికారులు ఇలాంటి ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఆ స్కూళ్లో అసలేం జరుగుతోందో, పిల్లల పట్ల ఎందుకింత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారో అన్నికోణాల్లో పరిశీలించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి దారుణాలు మరెక్కడా జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.*

అభం శుభం తెలియని ఓ నాలుగో తరగతి చిన్నారిపై ఇటీవల నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డు ప్రాంతంలో ఉన్న ఒవెల్-14 స్కూల్‌లో లైంగిక దాడి జరగడం దారుణం. ఈ స్కూల్‌లో పిఆర్‌ఓగా పనిచేస్తున్న బ్రహ్మయ్య అనే మృగాడు గత కొద్దిరోజులుగా ఆ బాలికను వేధిస్తూ బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో ఆ చిన్నారి భయపడిపోయింది. ఏదో ఒక వంకపెట్టి పాఠశాలలోని ల్యాబ్‌లోకి తీసుకువెళ్లడం, అసభ్యంగా ప్రవర్తించడం ఆ కామపిశాచికి నిత్యకృత్యమైపోయింది. పాఠశాల నిర్వాహకులు కానీ, ఉపాధ్యాయులు కానీ ఎవరూ ఈ విషయం పట్టించుకోకపోవడంతో ఆ చిన్నారి తనపై జరుగుతున్న అకృత్యాన్ని తల్లితండ్రులకు చెప్పి పెద్దగా రోదించింది. ఈ సంగతి ఎవరికైనా చెప్తే చంపేస్తానని కూడా బాలికను బెదిరించాడట ఆ నీచుడు. పిఆర్‌ఓ చేస్తున్న ఈ వికృతచేష్టలను పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలికి చెప్పినా ఆమె పట్టించుకోలేదని ఆ బాలిక విలపిస్తూ చెప్పడంతో తల్లితండ్రులు, బంధువుల గుండె మండిపోయింది. అందరూ ఆగ్రహావేశాలతో స్కూల్ వద్దకు వెళ్ళి ఆందోళన చేపట్టారు. అయితే, స్కూల్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన ఆ చిన్నారి తల్లితండ్రులు నేరుగా వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రంగంలోకి దిగిన పోలీసులు

ఒవెల్ స్కూల్‌లో చిన్నారిపై జరిగిన లైంగిక వేధింపుల విషయం జిల్లా ఎస్పీ విజయారావు దృష్టికి రావడంతో, ఆయన వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలంటూ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదుచేసి, పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడిన పిఆర్‌ఓ బ్రహ్మయ్యను నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యంపై ఆ బాలిక తల్లితండ్రులు చేసిన ఆరోపణలను కూడా విచారిస్తామని డిఎస్పీ తెలిపారు.

## ఒవెల్ స్కూల్ గుర్తింపు రద్దు - డిఇఓ

తమ బిడ్డపై జరిగిన ఈ దారుణానికి అందరూ బాధపడుతుంటే, స్కూల్ యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యంగానే మాట్లాడుతుండడం పట్ల సర్వత్రా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలికపై ఓవెల్ స్కూల్ పిఆర్‌ఓ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో, ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి డిఇఓ సుబ్బారావు తెలిపారు.

## ఆ స్కూల్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

**- మంత్రి కాకాణి ఆదేశం**

ఓవెల్ స్కూల్లో బాలికపై జరిగిన లైంగిక వేధింపు ఘటనపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. వెంటనే ఆ స్కూల్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఘటన దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి అన్నారు. ఈ విషయమై పోలీసులు లోతుగా విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరంగా కఠినచర్యలు చేపట్టాలని, పాఠశాల నిర్వహణకు భవిష్యత్తులో కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఆయన అధికారులను ఆదేశించారు.

## యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**- విద్యార్థి సంఘాల డిమాండ్**

నాలుగో తరగతి బాలికపై ఓవెల్ స్కూల్ పిఆర్‌ఓ లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమంటూ నెల్లూరులోని పలు విద్యార్థి సంఘాలు, పార్టీలు మండిపడ్డాయి. ఆ స్కూల్ గుర్తింపును శాశ్వతంగా రద్దుచేయడమే కాక, స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 15న నెల్లూరులోని డా. జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో పలు విద్యార్థిసంఘాల వారు పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ, స్కూళ్లలో ఇలాంటి అకృత్యాలు ఘోరమన్నారు. ఓవెల్ స్కూల్లో ఘటనను పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

## బంద్‌కు పిలుపునిచ్చిన విద్యార్థి సంఘాలు

ఏపి విద్యార్థి జేఏసి, ఏఐఎస్ఎఫ్‌తో పాటు పలు విద్యార్థి సంఘాలు ఈ ఘటనపై ఆందోళన చేపట్టాయి. ఈనెల 16న స్థానిక సర్వోదయ కళాశాలలో సమావేశమై, ఆ బాలికపై జరిగిన అన్యాయంపై దశలవారీగా పోరాటం చేస్తామని ఆ సంఘాలు పేర్కొన్నాయి. బాలికపై లైంగిక వేధింపులకు నిరసనగా నెల్లూరు రూరల్‌లోని పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈనెల 18న శుక్రవారం ఆ మేరకు బంద్ పాటించనున్నట్లు ఏపి విద్యార్థి జేఏసి రాష్ట్ర కార్యదర్శి ఆదిత్యసాయి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు.

# జోరువానలు.. జనం అవస్థలు



జిల్లాలో ఇటీవల ఒకటే వాన. మూడురోజుల పాటు వానలు దంచికొట్టాయి. 13వ తేదీన కుండపోత వాన కురిసింది. ఈ వర్షంతో జనం అవస్థలు అన్నిన్ని కావు. జనజీవనం స్తంభించిపోయింది. జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి. పొలాల్లో నీళ్ళు నిలిచాయి. అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. నెల్లూరు నగరంలో పరిస్థితి మరింత అధ్వాన్నం. రోడ్లన్నీ మురుగుకాలువలే. భూగర్భడ్రైనేజీ సంగతి పట్టించుకునే నాధులే లేకపోవడంతో ఎక్కడికక్కడి మురుగంతా రోడ్లమీదకొచ్చి కాలువలు కట్టింది. అండర్‌బ్రిడ్జిలు మునిగిపోయి వాహనాల రాకపోకలు లేక ప్రజలు నానారకాల ఇబ్బందులు పడ్డారు. నగర శివారు ప్రాంతాల్లో మురుగు నిండిపోయింది. ఎక్కడ చూసినా రోడ్లు ఘోరంగా ఉంటున్నాయి. ఎప్పుడు వానలొచ్చినా నగరానికి ఈ దుస్థితి తప్పడంలేదు. జిల్లా నాయకులు, అధికారులు నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతామని చెప్తుంటారేకానీ, వానొచ్చినప్పుడు నెల్లూరును చూస్తే ఎంత గొప్పగా ఉంటుందో తేటతెల్లమవుతుంది.

# విశాఖ 'వైజేపి' సభ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే భాజపాతో దోస్తీ చేస్తున్న జనసేన తాజాగా టీడీపీతో చేయి కలపడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. భాజపా, తెదేపా ఎప్పటికీ కలవబోవు అనుకుంటున్న రాజకీయవర్గాలకు భాజపాతో ఉన్న జనసేనాని టీడీపీతో ఎలా కలుస్తారన్న సందేహాలు కూడా కలిగాయి. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎవరు ఎవరితో కలుస్తారన్న..? చర్చ చక్కర్లు కొడుతున్న సమయంలో మోడీ - జగన్ సభ, అటు రాజకీయపార్టీలను ఇటు రాజకీయ వర్గాలను గందరగోళంలోకి నెట్టేసిందంటున్నారు విశ్లేషకులు.

ప్రధాని ప్రారంభించిన పథకాలన్నీ కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టినవి, చేపట్టబోయేవి. వీటి ప్రచారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి ప్రకటనలు ఇచ్చింది. సభా నిర్వహణ, జనసమీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇదే సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సర్... సర్ అంటూనే తమకు రాజకీయాలు, పార్టీలకంటే రాష్ట్ర ప్రయోజనాలు, రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంటూ మాట్లాడారు. మీతో మా అనుబంధం రాజకీయాలకు అతీతం అంటూ స్నేహహస్తానికి సంకేతాన్ని ఇచ్చారు. విశాఖకు తరలివచ్చిన జనాన్ని చూస్తుంటే శ్రీకాకుళం జానపదం "ఏం పిల్లడా ఎల్దా మొస్తవా" అన్న పాట గుర్తొస్తుందంటూ సభికులను జగన్ ఉత్తేజపరచారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సైతం ఆంధ్రులకున్న ప్రత్యేకతలను ఆకాశానికి ఎత్తేశారు. ఆంధ్రుల సత్తా విశ్వవ్యాపితమవుతుందంటూ కొనియాడారు. పనిలో పనిగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని, హరిబాబుని ప్రశంసలతో ముంచెత్తారు.

ఇదే సమయంలో జనసేనాని పవన్ కళ్యాణ్‌ని పిలిపించుకుని ఓ అరగంట మాట్లాడారు. ఈ పరిణామాలన్నీ ఇప్పుడు రాజకీయవర్గాలలో పెద్ద చర్చనే రేపుతున్నాయి. జగన్, మోడీల జోడీ బలపడిందన్న వాదనలు వినపడుతున్నాయి. పవన్, బాబులకు మూడిందన్న మాట కూడా చక్కర్లుకొడుతోంది. విశాఖ సభ తరువాత వైకాపా శ్రేణుల్లో జోరు పెరిగిందని, పవన్ని అడ్డం పెట్టుకుని భాజపాతో దోస్తీ చేయాలన్న బాబు ఆశకు అడ్డుకట్టపడిందని, బాబుని భాజపాకు దగ్గరచేసి జగన్ని ఓడించాలనుకున్న పవన్ వ్యూహం బెడిసికొట్టిందని విశ్లేషకులు అంటున్నారు. ఇదే సమయంలో సోము వీర్రాజును 'మీ పేరేంటి...? మిమ్మల్ని మీరే పరిచయం చేసుకోండి' అని సాక్షాత్తు ప్రధానమంత్రి అడగడంతో రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమైపోయిందని కూడా అంటున్నారు.

ప్రధాని తెలంగాణకు వెళ్తే... అక్కడ ప్రభుత్వం కనీస మర్యాద కూడా ఆయనకు ఇవ్వడంలేదు. ఆ పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ తనదైన తరహాలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసి కేంద్ర పెద్దలను ప్రసన్నం చేసుకుంటున్నాడు. ఆంధ్రాలో ఆ పార్టీ అధ్యక్షుడెవరో కూడా ప్రధానికి తెలియని దీనస్థితిలో కమలం పార్టీ ఉంది. ఇదే తరుణంలో రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి 'జయహో మోడీ' అంటూ రాష్ట్ర ప్రభుత్వం హారతులు పట్టింది.

రాష్ట్రంలో తమ పార్టీ తప్ప మరో పార్టీయే లేదన్న సంకేతాలను కేంద్రానికి ఇచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు ఆంధ్రాలో డమ్మీలే అన్నట్లుగా మోడీ కార్యక్రమాన్ని హైజాక్ చేసి వ్యూహాత్మకంగా వైసీపీ తమ సత్తాచాటుకుందన్నది కూడా విశ్లేషకుల భావన. మొత్తానికి బీజేపీ, వైసీపీ కలిసి నిర్వహించిన 'విశాఖ వైజేపి సభ' మాత్రం సూపర్ సక్సెస్.

## కిడ్నీలో రాళ్ళ తొలగింపుకు..

# అపోలోలో అత్యాధునిక లేజర్ చికిత్స



కిడ్నీల్లో రాళ్ళను తొలగించేందుకు, ఎలాంటి కోత లేకుండా లేజర్ చికిత్సతో పూర్తిగా నయంచేసే అత్యాధునిక వైద్యం నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులోకి వచ్చింది. అపోలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ వేదమూర్తిరెడ్డి ఈనెల 15న అపోలో ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ఈ విషయం తెలిపారు. కిడ్నీల్లో రాళ్ళ పరిమాణాన్ని బట్టి వాటిని తొలగించేందుకు ఇప్పటిదాకా శస్త్రచికిత్స నిర్వహిస్తుంటారని, అయితే తమ ఆసుపత్రిలో అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో లేజర్ చికిత్సను అందుబాటులోకి తెచ్చామని వారు చెప్పారు. 60వాట్ల దులియం ఫైబర్ లేజర్ పరికరం సహాయంతో ఎండోస్కోపి విధానం ద్వారా, ఎలాంటి ఆపరేషన్ లేకుండానే రాళ్ళను తొలగిస్తున్నామన్నారు. నెల్లూరు అపోలో ఆసుపత్రిలో మాత్రమే ఈ అధునిక లేజర్ చికిత్స ఉందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జయభారత్‌లో నేత్ర వైద్య శిబిరం

స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడిన యోధుడు బిర్సా ముండా జయంతిని ఈ నెల 16వ తేదీన నెల్లూరు జయభారత్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రవైద్య శిబిరం ఏర్పాటు చేసి 200 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య, లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సింహపురి వైద్యసేవా సమితి ట్రస్టు ఛైర్మెన్ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి హరికుమార్‌రెడ్డి, కోశాధికారి గుర్రం సుధాకర్, ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, అరవింద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఆ 'నిర్ణయాలు' లోకేష్‌కు కలిసి వస్తాయా!?



రాజకీయాలలో ఎదుటిపక్షం వారిని ప్రత్యర్థులు గానే చూడాలి తప్ప, రాజకీయ శత్రువులుగా పరిగణించగూడదని మన వెంకయ్యనాయుడు... సందర్భం లభించిన ప్రతిసారీ మరిచిపోకుండా చెబుతూ ఉంటారు. అది ఆయన తరం మాట.

ఇప్పుడు తరం మారింది. రాజకీయం కొత్త రూపు సంతరించుకుంది. అసెంబ్లీకో... లోక్‌సభకో ఎన్నిక కావడం కోసమే ఇప్పటి రాజకీయం పరమార్థం. ఇందుకు ఏ పద్ధతులు అవలంబిస్తున్నామనేది అప్రస్తుతం... అప్రధానం అయిపోయాయి. పార్టీల నేతలకూ ఈ విషయం పట్టడం లేదు.., ఓటర్లకూ అంతకంటే పట్టడం లేదు.

ఆంధ్రలో ఇప్పుడు వైసీపీ... టీడీపీ బరికి అటూ ఇటూ ఎదురెదురుగా కత్తులు దూసుకుని నిలబడి ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులుగా కాదు. రాజకీయ శత్రువులుగా ఒకదానిని చూసి ఒకటి బుసలు కొడుతున్నాయి. మాటలతో పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ మాటల దాడుల్లో ముప్పాతిక మూడు పాళ్ళు వ్యక్తిగత స్థాయిలో అప్రతిహతంగా సాగిపోతున్నాయి. సిద్ధాంతాలు, విధానాలు అడ్రసు లేకుండా పోయాయి.

ఎన్నికలు ఇంకా ఓ సంవత్సరానికి పైబడి ఉన్నప్పుడే పరిస్థితి ఇలా ఉంది.. ఇక, ఎన్నికలు దగ్గర దగ్గరకు వచ్చేసరికి పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరికి వారు ఊహించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో 175కి 175 స్థానాలలోనూ వైసీపీ అభ్యర్థులే విజయం సాధించాలనే గట్టి పట్టుదలతో వైసీపీ అధినేత జగన్ పావులు కదుపుతున్నారు. శాసనసభలో తెలుగుదేశం కనపడకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

ఆ విధంగా తనంటే ఏమిటో దేశానికి చాటాలని జగన్ భావిస్తున్నారు.

ఆయన కలను సాకారం చేయడానికి కావలసిన సమస్త వనరులు అన్నీ ఆయన కనుసన్నల్లోనే ఉన్నాయి.

చూసి రమ్మంటే.... కాల్చేసి వచ్చే వీర విధేయ అనుచరులు, వారిని కార్యోన్ముఖులను చేయడానికి కావలసిన అంగ బలం, అర్థబలం జగన్ కనుసైగ కోసం వేచి చూస్తుంటాయి. జగన్ మనసెరిగి నడుచుకోవడంలో మంత్రులు సైతం పోటీ పడుతున్నారు.

ఇక, జగన్ విజయం సాధించాలని భావిస్తున్న 175 నియోజకవర్గాలలో 'ఆ మూడు' అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. అవే చంద్రబాబును 1985 నుంచి దాదాపు తొమ్మిదిసార్లుగా గెలిపిస్తూ వచ్చిన కుప్పం, నారా లోకేష్ రెండోసారి పోటీ చేయడానికి సమాయత్తం అవుతున్న మంగళగిరి, తెలుగు దేశం పార్టీ ఆంధ్ర శాఖకు అధ్యక్షుడిగా ఉన్న అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి.

ఈ విషయాన్ని చంద్రబాబునాయుడు పరిగణనలోకి ఎంత తీసుకున్నారో తెలియదు. ఎందుకంటే... ఆయన ఇప్పటికీ 'శాస్త్రోక్త' రాజకీయ పద్ధతుల్లోనే వెళుతున్నట్టుగా కనపడుతున్నారు.

'శాస్త్రోక్త' రాజకీయ పద్ధతులు వెంకయ్యనాయుడు కాలం నాటివి. ఇప్పుడు నడుస్తున్నది 'న్యూ వేవ్' రాజకీయం.

దీనికి తగ్గ రీతిలో టీడీపీని ఆయన సమాయత్తం చేశారా అనే విషయం చంద్రబాబు మదింపు చేసుకోవాలి.

ఆ విషయం అలా ఉంచితే... పార్టీలో రెండు 'వ్యూహాత్మక' తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయా అని అనుమానాలు పరిశీలకులకు కలుగుతున్నాయి లోకేష్ రాజకీయాలకు సంబంధించినంత వరకు.

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడు కనీసం నూట పాతికకు తక్కువ లేకుండా టీడీపీ అభ్యర్థుల తరఫున ఆయా నియోజకవర్గాలలో ప్రచారం చేయవలసి ఉంటుంది. టీడీపీకి ఆయన ఒక్కరే స్టార్ క్యాంపెయినర్ కనుక శరీరం సహకరించినా, లేకపోయినా... టీడీపీకి ఆయనే కర్త, కర్మ, క్రియ.

కానీ, ఆయనను కుప్పం నియోజకవర్గానికే పరిమితం చేసే విధంగా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి వ్యూహాన్ని రూపొందిస్తారు. పైపెచ్చు వైసీపీ అధినేత జగన్, కుప్పంలో ఎన్నికల పరిస్థితులను స్వయంగా మానిటర్ చేసే అవకాశం ఉంది. అటు వంటి పరిస్థితులు చంద్రబాబుకు ఎదురైతే "టీడీపీ కోట" రక్షణ భారం ఎవరు చేపడతారు అనేది ఎవరి కైనా కలిగే సందేహం.

అటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ మాత్రమే అన్నీ తానై పర్యవేక్షించవలసి ఉంటుంది.

నాయకులు, ముఖ్యుల మధ్య సమన్వయం, వనరుల పంపిణీ, ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం వంటి సవాలక్ష పనులను పర్యవేక్షిం చడానికి లోకేష్ పార్టీకి అవసరం.




మరి, అటువంటి లోకేష్... మంగళగిరిలో 'ఇరుక్కు' పోతే!?

కుప్పంపై అధికార పక్షం ఎంత ఫోకస్ పెడు తుందో.... మంగళగిరిపై కూడా కుడి, ఎడంగా అంతే ఫోకస్ పెడుతుందనడంలో సందేహం అవసరం లేదు.

ఆయన, వీలైనంత ఫ్రీగా ఉండకుండా, మంగళ గిరితో బిజీ అయిపోవడం... మంచి ఐడియా అని పించడం లేదు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తే శాసన మండలి ద్వారా చట్టసభలోకి ప్రవేశించి, మంత్రి కావడం అనేది ఆయన చేతిలోని పనే. బీహార్‌కు దశాబ్దంన్నరకు పైబడి ముఖ్యమంత్రిగా ఉంటున్న నితీష్‌కుమార్ ఒక్కసారి కూడా ఎంఎల్ఏగా ఎన్నికవ్వలేదు. దేశానికి పదేళ్ళ ప్రధానిగా చేసిన మన్మోహన్‌సింగ్ కూడా లోక్‌సభకు ఎన్నిక కాలేదు. అందువల్ల, అసెంబ్లీకి లోకేష్ ఎన్నిక కావలసిన 'అనివార్యత' ఏమీ కనిపించడం లేదు.

ఒకవేళ టీడీపీ విజయం సాధించలేకపోతే మంగళగిరిలో లోకేష్ గెలిచి మాత్రం ఏమి ప్రయో జనం? ఇప్పుడు శాసనసభలో చంద్రబాబు ఎదుర్కొం టున్న పరిస్థితులనే రేపు లోకేష్ కూడా ఎదుర్కొంటారు. అందువల్ల, 2024 ఎన్ని కల్లో పోటీ చేయాలనుకోవడం ఒక వ్యూహా త్మక తప్పిదం అనిపిస్తోంది.

లోకేష్ తన పూర్తి సమయాన్ని టీడీపీకి అందుబాటులో ఉంచుకోవలసిన అవసరం ఉంది.

ఇక, లోకేష్ పరంగా చోటు చేసుకుంటున్న రెండో వ్యూహాత్మక తప్పిదం... ఆయన అసలు మంగళగిరి నుంచి పోటీ చేయాలి అనుకోవడమే అనిపిస్తుంది. నేల విడిచి సాము చేయడం లాంటిది ఈ నిర్ణయం. సాము గరిడీ ఏది అయినప్పటికీ కాళ్ళు మాత్రం నేల మీద బలంగా ఉండాలి అంటారు.

బహుశా 2019లో మంగళగిరిలో ఓడిపోయాం కాబట్టి, అక్కడ గెలిచి చూపించాలి అనే పట్టుదలతో లోకేష్ ముందుకు వెళుతున్నట్టు కనబడుతుంది.

ఆయన నియోజకవర్గం మంగళగిరి కాదు, కుప్పం. చిత్తూరు జిల్లా. రాయలసీమ ప్రాంతం.

మంగళగిరి నియోజకవర్గమేమో గుంటూరు జిల్లా. కోస్తా ఆంధ్ర ప్రాంతం. ఈ రెండూ ఒక దానితో ఒకటి సారూప్యం లేని భిన్న ప్రాంతాలు.

చంద్రబాబునాయుడు 1985 నుంచి కుప్పం నియోజకవర్గాన్ని సాకుకుంటూ వస్తున్నారు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా ఆయన ఓటమి పాలు కాలేదు.

ఆయన వయసు ఇప్పుడు 73 సంవత్సరాలు. మరో ఒకటి, రెండు ఎన్నికలు మాత్రమే ఆయన కుప్పం నుంచి పోటీచేసే అవకాశం ఉంది.

ఆ తరువాత? లోకేష్ కుప్పంను వదిలేస్తారా?

సొంత నియోజకవర్గమైన కుప్పంను వదిలేసి, అద్దె నియోజకవర్గమైన మంగళగిరిపై దృష్టిపెట్టడం అనేది... లోకేష్ వ్యక్తిగత రాజకీయ గమనంలో ముందు ముందు ఒక తప్పిదం అవుతుంది. ఇంకా ఎనిమిది, తొమ్మిది ఎన్నికల్లో పోటీచేసే వయసు ఆయన పక్కన ఉంది. అందువల్ల, ఎన్నికల్లో పోటీకి ఆయన తొందరపడాల్సిన పని లేదు.

మొత్తం పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ, పార్టీ నిర్వహణలో తగినంత అనుభవం సంపాదించడమే ఆయన చేయవలసిన పని.

మరో వ్యూహాత్మక తప్పిదం... ఎక్కువగా(అతిగా కూడా ) మీడియాలో కనపడడం అనే భావన చాలామందికి కలుగుతోంది.

సందర్భాన్ని బట్టి అచ్చెన్నాయుడు, కొమ్మారెడ్డి పట్టాభి, వర్ల రామయ్య, అశోక్‌బాబు, జవహర్, బుద్దా వెంకన్న, బోండా ఉమా, ధూళిపాళ్ళ నరేంద్ర, దేవినేని ఉమా, యనమల రామకృష్ణుడు, వంగలపూడి అనిత, ఇంకా చాలా మంది జగన్‌నో... ఆయన సారథ్యంలోని ప్రభుత్వం లోటుపాట్లనో రోజువారీ విమర్శిస్తూనే ఉన్నారు.

లోకేష్ కూడా చంద్రబాబు రేంజ్‌లో ప్రభుత్వాన్ని అంతే నిశితంగా విమర్శిస్తు న్నారు. అంటే... చంద్రబాబుకు సమానాంతరంగా విరుచుకుపడుతున్నారు.

ఎందుకు? లోకేష్ ఉద్దేశం ఏమిటి? చంద్రబాబునాయుడు విమర్శించడానికి ఒక లక్ష్యం ఉంది. ప్రతిపక్ష నాయకుడిగా ఒక హోదా, స్థాయి ఉన్నాయి. మరి, లోకేష్ లక్ష్యం ఏమిటి? ఎందుకు విమర్శలు గుప్పిస్తున్నారు అనేది అర్థం కాదు.

ఆయన ఈ రోజున తండ్రి చాటు బిడ్డ. ఆయన తరువాత, పార్టీకి సారథ్యం చేపట్టవలసి ఉన్న యువకుడు. ఇప్పుడు ఎంత తెరవెనుక పని చేస్తే... భవిష్యత్‌లో అంతగా రాణిస్తారు.

ఇటువంటి రెండు, మూడు లోటుపాట్లను సరిదిద్దుకోగలిగితే లోకేష్ మరో పాతిక, ముప్పై సంవత్సరాల పాటు ఆంధ్ర రాజకీయాల్లో కీలక, ప్రముఖ పాత్ర పోషిస్తారనడంలో సందేహం లేదు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## పర్యావరణ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలి

ప్రకృతిని ప్రతిఒక్కరు కాపాడుకోవాలని, పర్యావరణ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అన్నారు. 'జగనన్న పచ్చతోరణం', భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాలను పురస్కరించుకుని ఇటీవల 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి కేడెట్లు, భారత్ స్కౌట్స్ విద్యార్థులచే నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని పెంచి పెద్దచేయడం ఎంతో ముఖ్యమని, అందుకు ప్రతిఒక్కరు శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి వి.ఎస్ సుబ్బారావు, సమగ్ర శిక్షా అభియాన్ ఏపిఓ ఉషా రాణి, ఏఎంఓ సుజాత, మండల విద్యాశాఖ అధికారి తిరుపాలు, పాఠశాల ప్రధానో పాధ్యాయిని సునీత, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ఐటిడిఏ ఏఎంఓ శాంతకుమారి, జిసిడిఓ శాంతి, స్థానిక కార్పొరేటర్ శాంతి, వ్యాయామ ఉపా ధ్యాయులు పి.వేణు, భారత్ స్కౌట్స్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. బి.వి.నగర్ కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి నేవల్ కేడెట్లు, సంతపేట ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల స్కౌట్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కనుపూరులో భారీ చోరీ

వెంకటాచలం మండలంలోని కను పూరులో ఈనెల 14వ తేది మధ్యాహ్నం వేళ భారీ చోరీ జరగడంతో ఆ గ్రామ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఆ గ్రామంలోని వల్లూరు చెంచురామయ్య దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి ఉండగా ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 25 లక్షల రూపాయ లతో పాటు 15 సవర్ల బంగారునగలను దొంగలు దోచుకుపోయారు. ఆ తర్వాత ఆ దంపతులు ఇంటికి వచ్చి చూస్తే ఇంకే ముంది..సొత్తంతా దొంగలపాలైంది. బాధితులు గోడుగోడుమంటూ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. వెంకటాచలం సిఐ గంగాధర్ సంఘటనాస్థలాన్ని పరి శీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పుస్తకాలతో.. అపార విజ్ఞానం

- విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి

పుస్తకాలతో అపారమైన విజ్ఞానం లభిస్తుందని, యువత-విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్ళి పుస్తకాలను చదువుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి చెప్పారు. 55వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విఎస్‌యు గ్రంథాలయ విభాగం వారు ఈనెల 14న ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథా లయాల విశిష్టతను వివరించారు. వివిధ ప్రాంతాల ప్రముఖ పుస్తక ప్రచురణ, విక్రయ సంస్థల పుస్తకాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. వివిధ శాస్త్ర విభాగాలకు, పోటీ పరీక్షలకు, వ్యక్తిత్వ వికాసానికి, సాహిత్యానికి, పురాణాలకు, ఇతిహాసాలకు సంబంధించిన సుమారు 5 వేలకు పైగా పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. గ్రంథాలయ ఇన్‌చార్జి డాక్టర్. వై.సుధారాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.విజయానందకుమార్‌బాబు, ఆచార్య అందె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌లో..

# విజయవంతంగా చిన్నారులకు లివర్‌మార్పిడి



చెన్నైలోని గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌లో ఇటీవల వందమంది చిన్నారులకు లివర్‌మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగాయి. ఈ ఆపరేషన్లన్నీ నూటికి నూరుశాతం జయప్రదం కావడం విశేషం. దీంతో ఆపరేషన్లు జరిగిన చిన్నారులందరికీ ఆరోగ్యవంతమైన జీవితాలను ప్రసాదించినట్లయింది. దేశంలోనే లివర్‌మార్పిడి విభాగంలో ప్రఖ్యాతి గాంచిన ఈ ఆసుపత్రిలో ఎంతో క్లిష్టమైన ఈ ఆపరేషన్లను అత్యంత ఖచ్చితత్వంతో, ఫలవంతంగా నిర్వహిస్తున్నామని గ్లోబల్ హెల్త్‌సిటీ హెపటాలజీ, సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ పచ్చ చెప్పారు. ఇటీవల నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని డిఎస్ఆర్ గెస్ట్ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ ఆపరేషన్ల ప్రాధాన్యతను వివరించారు.

### కాలేయం సమస్యలతోనే అనారోగ్యం

చిన్నారుల్లో 60 శాతం కాలేయం పనితీరు దెబ్బతినే సమస్యకు ఎక్స్‌ట్రా హెపటిక్ బైలరీ అర్టీసియా కారణమని, ప్రతి 15వేల మంది చిన్నారుల్లో ఒకరికి ఈ అనారోగ్య స్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కాలేయానికి సంబంధించిన ఎంజైమ్‌లలో లోపాల వల్ల ఇలా జరుగుతుంటుందని, సాధారణంగా జీవక్రియల ప్రక్రియల వల్ల, కలుషితమైన పదార్థాలు విసర్జితమైన్యూట్రియంట్లు శరీరంలోకి శోషించబడతాయని, అయితే ఎప్పుడైతే సమస్య మొదలవుతుందో అప్పటినుంచి కాలేయం పనితీరులో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈ సమస్యను ముందుగా నిర్ధారణ చేసుకోవడం ముఖ్యమని, సరైన శస్త్రచికిత్స చేయించుకోవడం వల్ల అప్పుడే పుట్టిన పిల్లల్లో కామెర్ల కారణంగా కాలేయం దెబ్బతినే సమస్య ఉండదని ఆయన వివరించారు. చెన్నైలోని గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీలో నిర్వహించిన 100 ఆపరేషన్లు విజయవంతం కావడం, అందులోనూ ఆ చిన్నారుల్లో అత్యంత తక్కువ వయసు కలిగి 5నెలల పసికందులకి, అత్యంత తక్కువ బరువు (4.2 కేజీలు) కలిగిన పిల్లలకు కూడా ఈ ఆపరేషన్లలను విజయవంతంగా చేయడం దేశంలోనే ఇదే ప్రథమమని ఆయన పేర్కొన్నారు.

### పేదలకు అందుబాటులో వైద్యసేవలు :

గ్లెనీగెల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీ యాజమాన్యం ప్రతినిధి, కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ వాకా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, పేదప్రజలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. లివర్ వ్యాధితో బాధపడుతున్నవారు కానీ, ఇతర ప్రాణాంతక వ్యాధుల బారిన పడినవారు కానీ తామందిస్తున్న అత్యంత అధునాతనమైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



2009లో కృష్ణకి పద్మభూషణ్ వచ్చిన సందర్భంగా ఆయనను సత్కరిస్తున్న డాక్టర్. సి.యం.కె

# మా కుటుంబ సభ్యుడిని కోల్పోయాం

**- డాక్టర్ సి.యం.కె.రెడ్డి**

సూపర్ స్టార్ కృష్ణతో తమ కుటుంబానికి 5 దశాబ్దాలకుపైగా అనుబంధముందని ప్రముఖ వైద్యనిపుణులు ఆచార్య సి.యం.కె.రెడ్డి అన్నారు. కృష్ణని కోల్పోవడం తమ కుటుంబంలో ఒకరిని పోగొట్టుకున్నట్లుగా ఉందని ఆయన తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలకుపైగా కృష్ణకి వ్యక్తిగత వైద్యునిగా, కుటుంబ మిత్రునిగా వారిద్దరిమధ్య అపురూప స్నేహ సంబంధాలు ఉన్నాయి. కృష్ణ హైదరాబాదుకి మకాం మార్చిన తరువాత కూడా ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా కృష్ణ ముద్దుకృష్ణారెడ్డిని సంప్రదించేవారు. పలు సందర్భాలలో విజయనిర్మల – కృష్ణల కోసం సి.యం.కె.రెడ్డి తానే స్వయంగా చెన్నై నుండి హైదరాబాదుకు వెళ్లేవారు. చెన్నైలో ముద్దుకృష్ణారెడ్డి సారధ్యంలో నడిచే అనేక కళా, సాహిత్య, సేవాసంస్థలకు కృష్ణ అండగా ఉండేవారు. వయసులో కూడా ఇద్దరూ దాదాపుగా సమకాలికులు. తన చిరకాల ఆప్తుడు ఇక లేడంటే నమ్మలేకున్నానని తమ విచారాన్ని వ్యక్తం చేశారు ముద్దుకృష్ణారెడ్డి.



2018లో విజయనిర్మలకు స్వల్ప అనారోగ్యం ఏర్పడినప్పుడు హైదరాబాదులోని వారి స్వగృహంలో కృష్ణ దంపతులను పలకరిస్తున్న ఆచార్య సి.యం.కె.రెడ్డి




# ప్రథమ వర్ధంతి

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి

**శ్రీమతి ఆదాల సుశీలమ్మ గారు**

పరమపదించి తేది.24-11-2022 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు

**ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

పార్లమెంటు సభ్యులు, నెల్లూరు

**ఆదాల మురళీకృష్ణారెడ్డి**

ఛైర్మన్, MAK గ్రూప్

కుమార్తెలు

**గునుపాటి శ్యామల**

**బిరుదవోలు జలజ**

మనుమలు

**ఆదాల వంశీకృష్ణారెడ్డి**

**ఆదాల దామోదర్‌రెడ్డి**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com